RSVmaA-128

ఓం

# గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘపక్షమున ప్రకటింపబడు సచిత్రమాసపత్రిక.

సంపుటము ౬ ] ఏప్రియల్, ౧౯౨౫ [ సంచిక ౪

సంపాదకుడు: అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయసూచిక

౧ గ్రంథాలయములు—జాతీయత

—ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి అధ్యక్షకోపన్యాసము ... ౧౮౩

౨ జనార్దన కుడాల్కారు ... ౧౮౮

౩ వివిధవిషయములు ... ౧౯౦

౪ గ్రంథాలయ వార్షికోత్సవము, మధిర ... ౧౯౨

౫ నిజాంరాష్ట్రాంధ్ర గ్రంథాలయసభ, మధిర ... ,,

౬ భారతవర్షమందలి ప్రాచీనసరస్వతీ భాండారములు ... ౧౯౭

౭ శ్రీరామనామస్మరణ ... ౨౦౦

వార్షికమూల్యము రు 3-0-0

విడిసంచిక వెల రు ౦-౪-౦.

బెజవాడ.

# జడకుచ్చులు

సుప్రసిద్ధాంధ్ర కవులగు

## రాయప్రోలు సుబ్బారావు

గారి నూతన గ్రంథము

వెల రు **1—0—0** మాత్రమే

జన్మభూమి.
తమ్ముడా!
ఆంధ్రమాత.
ప్రబోధము.
పుస్తకము.
వసంతము.
శక్తి.
వసంతవికాసము.
శేషచైత్రము.
పూవు.

పూజ.
విరహావీథి.
పిలుపు.
మధుమాలి.
గీతాం దేహి.
ప్రవాసరాధిక.
సఖీసంవరణం.
మేఘము.
ఎవరు?

కోయిల.
కనకము
ధ్యానిబుద్ధప్రతిమ.
కవిత.
ఆచారక్షయము.
ఒకమాట.
రాధపిలుపు.
తిలకము.
రామలింగారెడ్డి.
కలియుగార్జునుడు.

అను విషయములమీాది పద్యము లిందు గలవు.

వలయువారిట్లు వ్రాయవలెను :—

ఆంధ్ర పరిషత్తు: బెజవాడ

కీర్తిశేషులైన

# శ్రీ జనార్ధన కుడాల్కారు



బరోడా గ్రంథాలయ శాఖాధ్యక్షులు



పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తి ఫలప్రదాం
ప్రణమ్య స్తౌమి తామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

ఆఱవ సంపుటము.

# గ్రంథాలయ సర్వస్వము

ఎనిమిదవ సంచిక.

## గ్రంథాలయములు—జాతీయత

పమిడిపాడు గ్రామమున జరిగిన ఆంధ్ర గ్రంథాలయ మహా సభాధ్యక్షులగు
ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారు ఆశువుగానిచ్చిన ఉపన్యాసమున కనువాదము.

గ్రంథాలయోద్యమమునుగూర్చి మీయెదుట ముచ్చటించుటకు నాకు సావకాశము కల్గినందును నేను సంతసించుచున్నాను. సూరి వేంకట నరసింహశాస్త్రిగారు ఇదివరలో ముచ్చటించినట్లు నాస్వభావమునుబట్టి రాజకీయక్షేత్రమున కృషి చేయుటకు నేను తగినవాడను కాను. అయితే వర్తమానకాలమున దేశమందలి కవులు, గాయకులు, చిత్రకారులు, తత్వవేత్తలు, ప్రకృతిశాస్త్రవేత్తలు, సన్యాసులు మున్నగు దేశోద్ధారకు లందరు దేశాభ్యుదయమునకై సర్వతోముఖముగ కృషి చేయవలసిన సమయ మాసన్నమైనది. నా జీవితమందలి కొన్ని సందర్భములవలన నేను రాజకీయక్షేత్రమునకు ఆకర్షింపబడి అచ్చటనే నా యుచిత ప్రయత్నము చేయవలయునను దృఢసంకల్పము నాకు రూఢమైనది. ఈ రెండు సంవత్సరముల అనుభవమువలన సాంఘికము, విద్యావిషయికము మున్నగాగల వివిధములగు మానవకృషి నంతను ఆధ్యాత్మికదృష్టితో సంస్కరించి కేంద్రీకరింపచేసినగాని రాజకీయముగ మనము అభివృద్ధిని పొందజాలమనుమాట నాకు నిశ్చయమైనది. ఆంధ్ర గ్రంథాలయోద్యమము భారత జాతీయ సౌధ నిర్మాణమునకు ఆంధ్రదేశమున పునాదులు వేసెననుమాట నిశ్చయము. జాతీయోద్ధారణ సాధకములగు అన్ని సదుద్యమములకు ఆంధ్ర గ్రంథాలయములు ఉనికిపట్టులుగా నుండు ననుమాట నిశ్చయము. గ్రంథాలయోద్యమము విద్యావిధానమున అంతర్భాగముగా నెంచబడతగినదై యున్నది. ఇదివరకు ఈ యుద్యమ పక్షమున ఇట్టి కృషియే జరిగియున్నది. ఈ సభకు అధ్యక్షుడుగా నుండుమని నన్ను కోరినందున ఈ యుద్యమముయొక్క స్వరూప స్వభావములను నిర్ణయించుటకును ఇందులీనమైయున్న విజాతీయతను తొలగించుటకును ఈ సావకాశమును నేను సద్వినియోగము చేసికొనుచున్నాను. మఱియు అఖిలభారత సభలో ఈ యుద్యమమునుగూర్చి నేను చేసిన ప్రసంగము పూర్వపక్షముగను వర్తమానోపన్యాసము సిద్ధాంతముగను ఎంచవలయును.

మామూలుగా అందరు సభాధ్యక్షులకు ఆచారమైనట్లు అచ్చునుండి మీకు ఉపన్యాసమును నేను చదువకుండినందుకు కొంత సమాధానము చెప్పవలసియున్నది. హావభావ విలాసములతో కూడి నా యెదుట ప్రత్యక్షముగానున్న సభ్యులతో నేను ముచ్చటించుగును గాని వారి మనోభావములు ఇట్లుండవచ్చునని ముందుగా నామనోఫలకమున చిత్రించుకొని వారిపరోక్షమున నా యుపన్యాసమును సిద్ధపరచు నాచారము నాకు సరిపడదు. వర్తమానకాలపు నవనాగరికపుస్త్రీ తాను కల్పించుకొన్న ఇతరవ్యావృత్తులచే నియమిత కాలముల యందు మాత్రము శిశువునకు స్తన్యమునిచ్చు అస్వాభావికపు పద్ధతిని యవలంబించవచ్చును గాని శిశు సందర్శన మాత్రముననే స్తన్యము స్రవించుటయే స్వాభావికము. వివిధ స్వభావములుగల సభ్యులు పరిషత్తులయం దుందురు గాన వారివారి రుచుల వైచిత్ర్యమును వక్త అనుసరింపవలెను. కావున ఆశువుగా ఉపన్యసించినందుకు నన్ను మన్నించవలెను.

కేవల రాజకీయములు కాని ఇతర సభలలో నేను జోక్యము గల్గ చేసుకొనుటకు కారణమును ఇప్పుడు చెప్పియుంటిని. మానవజీవితము ప్రభిన్నమైనదను వాదము నేనంగీకరించను. ఈ రెండు సంవత్సరములనుండియు ఇతర సాధనముల మూలమున దేశాభ్యుదయము పొందు మార్గముల ననుసరించుటకంటె రాజకీయ వ్యవహారముల యందే దేశనాయకులు నిమగ్నులై యుండిరి. జాతీయాభ్యుదయము పొందుటకు ప్రథమమున రాజకీయ సమస్యలకు సమాధానము కుదుర్చుట అత్యావశ్యకమే యైనను హిందూదేశముయొక్క ప్రత్యేకపరిస్థితులను బట్టి సాంఘిక, విద్యావిషయికోద్యమములు జయప్రదముగా కొనసాగించుచు రాజకీయోద్యమము కొంతకాలమువరకు వెనుకకు నెట్టుట మనకు నావశ్యకమైనది. కావుననే నేను జయిలునుండి బయటకు వచ్చినప్పటి నుండియు సాంఘికశృంఖలములను సడల్చుటకే నేను కృషిచేయుచుంటిని. మహాత్ముడు నిర్మాణకార్యక్రమమున అస్పృశ్యతా నివారణకును దౌర్జన్యరాహిత్యమునకును ప్రాముఖ్యత నిచ్చుటయందలి ఉద్దేశము, సాంఘికరాజకీయ క్షేత్రములయందు తీవ్రమగు కృషి జరుపవలెనని ప్రజలను పురికొల్పుటకే యని నేనూహించుచున్నాను. గ్రంథాలయోద్యమము ముఖ్యముగా విద్యావిషయికమైనది గనుక దానిని మనము చేపట్టి భారతజాత్యభ్యుదయము కొరకు ఈయుద్యమము ఎంతవరకు సాధనభూతము కాగలదో అంతవరకు అందుమూలమున మనము సంపూర్ణముగ లాభము పొందవలసియున్నది. ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమమునకు మూలపురుషులగు మ. రా. రా. శ్రీ అయ్యంకి వెంకట రమణయ్యగారు ఈ సభాధ్యక్షపదవి నధిష్ఠించవలసినదని నన్ను కోరినపుడు నేను ఆకోరికను సంతోషముతో స్వీకరించితిని. ఈయుద్యమముయొక్క ఆంతరంగిక మగు వ్యవహారములు నాకు తెలియవుగాని మహాత్ములు స్థాపించిన జాతీయోద్యమముయొక్క జయము చాలవరకు ఈ యుద్యమమూలమున చేకూరెనని నేనెరుగుదును. ప్రతిగ్రంథాలయపు అధ్యక్షుడును కార్యదర్శియు గాంధిరాజ్యపు మునసబుగా గాని కరణముగా గానియుండెను. ఈ రెండు సంవత్సరములలో ఆంధ్రదేశమందలి చాల గ్రామములయందు నేను సంచారము చేసియుంటిని. అపుడు ప్రతి గ్రంథాలయమును ఈమహోద్యమమును ప్రజ్వలింపజేయు కార్యక్షేత్రమై ప్రాముఖ్యత వహించి యుండెను. ఈ యుద్యమములో కొంత విజాతీయత లీనమై యున్నమాట నిజమే యైనను దీని మూలమున దేశాభ్యుదయమునకు కల్గిన బలమును బట్టి ఇందును గూర్చి మనము కృతజ్ఞులమై యుండవలసియున్నది.

పరిషమ అఖిలభారత గ్రంథాలయసభ చెన్నపట్టణములో జరిగినపుడు గ్రంథాలయోద్యమము జాతీయ ప్రతిష్ఠాపనమేనా యనువంశమునుగూర్చి తీవ్రమగు చర్చ జరిగినది. అపుడు సభాధ్యక్షులగు ముదలియారుగారు ఆయన పదవినిబట్టి ఆయనకు అదనముగాగల వోటు నిచ్చుటచే ఈయుద్యమము విజాతీయమని నిర్ధారణ కాకుండ తప్పించిరి. అప్పటినుండియు నీవిషయమై పత్రికాముఖమున గాని సభలలోగాని చర్చ జరుగలేదు. కడచిన పదిసంవత్సరములనుండియు ఉద్యమ చరిత్రను మనము పరిశీలించితిమేని ఇందు లీనమైన విజాతీయ స్వభావమును పోగొట్టుకొనుటకును జాతీయ ప్రతిష్ఠాపనగా దీనిని నిర్మాణము చేయుటకును మనజాతీయాంతరాత్మ చేసినకృషి మనకు బోధపడక మానదు. ఒక గ్రంథాలయము కుస్తీపట్లు, కత్తిసామునకు ప్రాముఖ్యత నిచ్చుచున్నది. ఇంకొకటి గ్రంథప్రకటన కార్యము నవలంబించుచున్నది. కొన్ని గ్రంథాలయములు సంగీతము మొదలగు లలితకళల యభివృద్ధికొరకు కృషి చేయుచున్నవి. ఇంకొకటి స్వచ్ఛందభటులను లేక గానుడండును తయారుచేయుచున్నది. మరియొకటి పసుపునూలు ఉద్యమమును వ్యాప్తి నొందించుచున్నవి. కొన్ని

గ్రంథాలయములు సహకార సంఘములను నభివృద్ధి నొందించుచున్నవి. పైనియంతటివలనను విజాతీయ భావములు దేశీయోద్యమములయందు లీనమగుటచే స్వాభావికముగా తీవ్రమగు ఏవగింపు కల్గుననియు, జాతీయాంతరాత్మయొక్క ఉత్తేజముచే అట్టి యుద్యమములు స్వాభావిక స్వరూపమును పొందుచున్నవనియు మనకు బోధపడక మానదు. నిజముగా ఐరోపా గ్రంథాలయములలో ఏదియు నిట్టిపనులను తలపెట్టదు.

గ్రంథాలయోద్యమమందు లీనమైయున్న మొట్టమొదటి విజాతీయభావము ఆ ప్రతిష్ఠాపనమునకు ఉపదేష్టకు స్థానము లేకపోవుట. భారతీయ ప్రతిష్ఠాపనలలో ఏదియు మానవప్రకృతికి సహజమగు లక్షణములు లేనిది లేనేలేదు. ప్రతిగ్రంథాలయమును నడుపు కార్యదర్శియు అధ్యక్షులును గ్రంథాలయమునకు వచ్చువారితో సన్నిహితసంబంధము కల్పించుకొనువారు కారు. ముఖ్యముగా వారు పుస్తకములను సేకరింతురు. వానిని భద్రపరుతురు. వర్గీకరణము చేయుదురు. ఈ వర్గీకరణము 'అ'కారాది క్రమముగ పుస్తకముల నామములను బట్టిగాని వాని గ్రంథకర్తలనామములనుబట్టిగాని చేయబడును గాని చదువరుల మానసపరిణామమునుబట్టిగాని వారి అవసరములనుబట్టిగాని జరుగుటలేదు. వారు చదువరులకు ఉపదేశముచేయువారమని గాని లేక చదువుకొనుటయందు సహాయము చేయువారమని గాని ఎప్పుడును చెప్పరు. ఈ గ్రంథాలయసభ్యులు చాలవరకు యువకులుగానే యుందురు గాని వారి మానసవికాసమును నైతికాభివృద్ధిని సరియైనమార్గముల నడుపుటకు వారికి సహాయము చేయుచుండవలయును. గ్రంథాలయము నిర్జీవమైనదిగానుండక సజీవమై మనుష్యత్వవికాసమునకు సహాయము చేయునదిగా నుండవలెను. చదువరుల అధికారానుసారముగ వారలకు పుస్తకములు చదువనిచ్చిన గాని గ్రంథాలయము ఉపయోగకారి కానేరదు. చిరకాలాగతముగ వచ్చుచున్న తత్త్వవేత్తలయొక్కయు, కళాభిజ్ఞులయొక్కయు పరిజ్ఞానమును భద్రపరచెడు ఊరగాయలజాడీలవంటివి గ్రంథాలయములని చెప్పనొప్పును. గ్రంథాలయము సర్వజనసామాన్యము చేయవలయునను ఉత్సాహముతో ఉత్తమాధమగ్రంథములకు సమానముగ అందు స్థానమీయబడుచున్నది. ఇందువలన విచక్షణాజ్ఞానములేని చదువరులకు ముప్పు వాటిల్లును. భారతీయవిద్యామర్యాదలను పరికించుచో పఠనీయ గ్రంథములు నిర్ణయించుటయందు అధికారిభేదము బాగుగా పాటింపబడినట్లు బోధపడగలదు. రసాయనశాస్త్రజ్ఞుని రసశాలలో అజ్ఞాని ప్రవేశించి అందలి వస్తువులను ఇచ్చవచ్చినట్లు స్పృశించినచో కల్గెడు ఫలితమేమో యూహింపుడు. రెండవది జాతీయభావము. గ్రంథాలయములయందు గ్రంథములయెడల సవినయమగు భక్తి లేకుండుట. భారతజాతియొక్క మర్యాదల ననుసరించి మనము ఏదైన పుస్తకము చదువుటకు ప్రారంభించకపూర్వము సరస్వతి, గజానన మొదలగు దేవతా ప్రార్థన శ్లోకములను చదువవలసియున్నది. ఆధునిక విద్యార్థులకు ఇవి నిరర్థకముగా తోచవచ్చును గాని అక్షరవిన్యాసము చేతను, వానిని సుస్వరముగా నుచ్చరించుట చేతను ఎట్టి మహాశక్తులుద్భవించుచున్నదియు, ఆ శక్తులు ఆత్మీయశక్తియొక్క వికాసమునకెట్లు సాధనభూతము లగునదియు విచక్షణాబుద్ధితో విచారించిన రూఢమగును. మంత్రముల ప్రభావమునుగూర్చి ఇచ్చట యుచ్చరించుట అప్రస్తుతము. పుస్తకములు కేవలవిద్యాసాధనములుగనే గాక నాదవిశిష్ట పేటికలుగగూడ మనము పూజింపవలెను. గ్రంథపఠనము పాఠకునియొక్క అధికారమును బట్టి అనేకరూపములను తాల్చవచ్చును. ఒకరు కానీ పత్రికలో విమర్శను ప్రచురించుటకు చదువవచ్చును. ఒకరు రాజ్యాంగపక్షమున గ్రంథమును బహిష్కరించు నుద్దేశముతో చదువవచ్చును. మఱియొకరు తన పాండితీగరిమను తన విద్యార్థులయెదుట ప్రగల్భములు కొట్టుకొనుటకు చదువవచ్చును. వేరొకరు మనికి పాటులు వచ్చుచున్న కాలమున ఎట్లో కాలము గడుపుటకొఱకై చదువవచ్చును. మనము మన గ్రంథాలయములయందలి పుస్తకములను సద్వినియోగము చేయు నుద్దేశముతో చదువవలెననిగదా మన యాశయము. దానినుండి చదువరి సంపూర్ణజ్ఞానము పొందవలయును. అందలి వర్ణసమామ్నాయోచ్చారణమువలనను దానియందు నిరూపణము చేయబడిన తత్త్వానుభవమువలనను కల్గెడి సంపూర్ణలాభమును పొంది చదువరి అభ్యుదయము పొందవలసియున్నది. వర్ణములును వాని యుచ్చారణము "మహేశ్వరమాత్రములు." అవి సర్వేశ్వరుని అలంకారమగు వర్ణమాల. బ్రహ్మ వర్ణములనుండియే ప్రపంచము సృష్టి చేసెను. అవి ప్రకృతిబీజములు. మరియు అవి ప్రపంచ పరిణామముయొక్క ప్రత్యక్షస్వరూపము. నాదము పురుషునియొక్క ప్రథమస్వరూపము. అది మానవుని అంత్యస్వరూపముకూడ నగుచున్నది. లెక్కలేని కళలు తర్వాత ఉత్పన్నమగును.

మనము విను ధ్వనికంటె నాదము ఎక్కువ మన్నితమైనది, మనము అనుభూతమగుదానికంటె దానియందు ఎక్కువ అర్థము లీనమైయున్నది. ఏకవస్తువు వివిధశబ్దవాచ్యమై వివిధస్థలములయందు వివిధమానవులచే నుచ్చరింపబడుచున్నది. ఉదాహరణకు దహింపచేయు వస్తువు నొకదానిని తీసుకొందుము. ఒకరు దీనిని ఫైరు అనిపిలుతురు. మరియొకరు అగ్నియందురు. ఇంకొకరు నిప్పుఅందురు. వస్తువు ఒకటే, వేరు వేరు మనుష్యులు. దీని పేరును, వేరు వేరుగా ఎందుకు వ్యవహరించవలెను? హాలు ఫైరు అనుశబ్దము వినినతోడనే మనకు కొన్ని యూహలు కలుగుచున్నవి. అగ్నియను మాట వినినతోడనే మరియొక విధమగు నూహలు కలుగుచున్నవి. ఈరెండు మాటలు రెండుభాషలలోనివి. ఈరెండుమాటల ఉచ్చారణవలన కల్గెడి మనోభావములు వేరుగానున్నవి. అవి వ్యక్తితో సంబంధముకలవి. మనము మన ఇష్టదేవతలనే యారాధింతుము. పరిస్థితితో కూడినపుడు గాని వ్యక్తిత్వమునకు సంపూర్ణవికాసము చేకూరదు. ఈ అనంతమగు బ్రహ్మాండమందు అనేకమగు అంతరములు గల పరిస్థితులుండియున్నవి. ప్రతివ్యక్తియు తన కనురూపమగు పరిస్థితి నాశ్రయించు చున్నాడు. గ్రంథాలయమున చదువరు లందరకు సమానమగు సావకాశములు కల్గచేయుట యుక్తమేగాని ఈసావకాశములను సద్వినియోగము చేసికొనుటకు తగిన సహాయము లేనిచో అందువలన అనర్థములు కల్గును. కావున ఉచిత గ్రంథములను చదువరి ఏరుకొనుట ముఖ్యావసరము. తాత్కాలిక ఉద్రేకము చేతను అసంస్కృతివాంఛచేతను పఠనీయ గ్రంథమును నిర్ణయించుకొనినచో దాని ఎప్పుడును తప్పుగానే పోవును. చదువరియొక్క అధికారమును నిర్ణయించి తదనుగుణమగు గ్రంథమును పఠింపచేయుటకు తగిన గురువు గ్రంథాలయమందుండితీరవలయును. చదువరియొక్క ఇష్టదేవత ప్రళయకాలాగ్ని రుద్రుడైయుండి ప్రళయకాలమందు బీభత్సరసముతో నాట్యముచేయు నటరాజుయొక్క పదవిన్యాసము. ఆవ్యక్తియొక్క కార్యములను ప్రేరణ చేయవలసినప్పుడు తగిన గ్రంథమును చదువరికి మనము నిర్ణయించనిచో సంతతసమరోన్ముఖుడగు పరశురాముని బుద్ధునిగా మార్చుటకు ప్రయత్నముచేయుట యగును. ఇట్టి విపరీతములు చదువరికి అనుకూలమగు గ్రంథము లభ్యముకానప్పుడు ఏర్పడును. గ్రంథస్థ పదములను, పదములందలి వర్ణములను, పదమునుండె వాక్యములను కూర్చినప్పుడు వానియన్నిటియందు గ్రంథకర్త మాతృవాత్సల్యము కలిగియుండును. గ్రంథమును ప్రీతితో పఠనముకొరకు స్వీకరించుట యనగా దానిని పూజించుటయే. తల్లి తన శిశువును ఇతరులకు ముద్దాడ నంగీకరించునప్పుడు శిశువును అధమము ఆఇతరుడు ఆశీర్వదించవలయునని యైనను తల్లి తలంచును. నీపిల్లలయందు నీకు ఎంతప్రేమయో ఇతరులుకూడ తమపిల్లలను అట్టిప్రేమతో చూడవలయునని కోరుదురుగదా. నీపిల్లలుచేయు తప్పులను నీవు ఖండించుదువుగాక! నీ పిల్లవాని అలవాట్లు మంచివికావని నీకు సంకోచ ముండునుగాక! అయినను నీపిల్లయెడల నీవు సంపూర్ణ మానవస్వభావముతోనే ప్రవర్తించెదవు. మన జీవితాభ్యుదయమునకు సాధనభూతముగా నుండు దానినే మనము స్వీకరింతుము. మనము స్వీకరించినదానియందు మనకు భక్తి యుండితీరును. ఇట్టి భక్తిభావము శూన్యముగానున్న పుస్తకాగారమును భారత జాతీయ ప్రతిష్ఠాపనగా పరిగణించుటకు వీలులేదు.

ధారావాహికముగా వచ్చుచున్న జాతీయజీవనమునకు అనుగుణ్యమగునట్లు అధునాతన పరిస్థితులను మార్చుటలో గ్రంథాలయమునందు దేవాలయమునందువలె పూజ్యభావము నెలకొల్పబడును. సంపూర్ణముగ పాశ్చాత్య ప్రతిష్ఠాపనయగు ఈ గ్రంథాలయమునకు అనుగుణ్యమగు బాహ్యరూపమును పొందియు ప్రత్యక్ష విరుద్ధ లక్షణములతో కూడియున్న భారతీయ ప్రతిష్ఠాపన సిక్కుల గురుద్వారమున అందుపూజింపబడు గ్రంథసాహెబును. ప్రపంచ ఖ్యాతియందు ప్రసిద్ధివహించిన సంయమీంద్రుల గీతాంజలుల యొక్క సమూహమే గ్రంథసాహెబు అగుచున్నది. అధునాతన గ్రంథాలయమున కొరతపడి యున్న భక్తిపరిపూర్ణులగు చదువరులు, ఏకలక్ష్యమందు మనస్సులను లగ్నముచేసిన శ్రావకులు, గురువును శిష్యులును వైద్యుడును రోగులును - వీరందరిని ఏకత్రసమావేశమే ఈఉన్నతమగు భారతీయ ప్రతిష్ఠాపనము నందలి ప్రాముఖ్య లక్షణములు.

గ్రంథాలయములయందు ఎట్టి గ్రంథములుండవలెనో విచక్షణ లేక పోవుట ఈ ప్రతిష్ఠాపన యందలి మూడవ విజాతీయ లక్షణము. ప్రచురింపబడిన ప్రతిగ్రంథమును ప్రతి మనుజునికిని అవసరములేదు. కొన్ని ప్రత్యక్షములుగా హానికరములు కొన్ని ఆగ్రంథకర్తలకే ఉపయోగకరములైనవి. కొన్ని తాత్కాలికముగా ఉపయుక్తములైనవి. కొన్నిగ్రంథములే శాశ్వతముగా భద్రపర్చ తగినవి. గ్రంథాలయమును సృష్టివై చిత్ర్యములతో నిండిన బ్రహ్మాండముతో పోల్చిచూచినచో చవిటిపఱ్ఱలు, ఎడారులు

జ్యోతిర్భాగములు, బురద మడుగులకు పోల్చతగిన కొన్ని గద్య కావ్యములును పుష్పఫలశోభితమగు వనాంతరములు, నేత్రపర్వము నొనర్చు రమణీయమగు ఉద్యానవనములు, నైలు గంగా మొదలగు మహానదులతో పోల్చదగు పద్య కావ్యములును ఇందున్నవి. ఇవి యన్నియు మనుజాళి దైనది జీవయాత్రకు అవసరమైనవి కావు. అయితే ఇందులో లేనివి మాత్రము గ్రంథాలయమందు గృహస్థుని ఇంటియందును, గ్రామమందును, గ్రంథాలయమందును, భద్రపర్చ తగినవి. బొమ్మ జెముడును ఉద్యానవనమందు పెంచవలెనని ఏ మనుష్యుడును వాంఛించడు, కాని ఓషధీవనములో వైద్యుడు దానిని పెంచితీరవలయును. మనజుడు కుక్కను, ఆవును తన యింట పెంచునుగాని సింహమును పెద్దపులిని పెంచడు. వీనిని వివిధ జంతు ప్రదర్శనశాలయందు జంతుశాస్త్రజ్ఞుడు పెంచును. ఓషధీవనము జంతుప్రదర్శనశాలయు కూడ సంపూర్ణముగ ప్రయోజనకరములని చెప్పుటకు వలనుపడదు. పెద్దపులియొక్కయు, సింహముయొక్కయు, సంపూర్ణ స్వభావము స్వాభావిక స్థితిలో వనమున కేటాడునపుడు వ్యక్తమగును గాని బందీకృతముగా బోనులో నుంచినపుడు కాజాలదు. నూతనముగా అభివృద్ధిని గాంచుచున్న జంతుశాస్త్రజ్ఞులకు ఈ ప్రదర్శన శాలల వలన కొంత ప్రయోజన ముండవచ్చును. అది ఉత్తమ ప్రయోజనము కానేరదు. సనాతనమగు ధర్మమును బోధించు గ్రంథములే గ్రంథాలయమం దుండతగినవి. అచ్చుపడినంత మాత్రమున గ్రంథాలయమున గ్రంథమునకు స్థానముండరాదు. ముద్రణ యంత్రమును, ప్రజాస్వామికతత్వము యొక్క అపభ్రంశభావమును ప్రతి గ్రంథమునకును గ్రంథాలయమున స్థానమిచ్చుటకు కారణములు. గ్రంథ ప్రకాశకులు కూడ ప్రతి గ్రంథమును ప్రకటించరాదు. నిజమగు గ్రంథాలయమందు వేదములు, ఖురాను, బైబిలు, తత్వశాస్త్రగ్రంథములు, ప్రకృతిశాస్త్ర గ్రంథములు, విజ్ఞాన సర్వస్వములు మొదలగు సద్గ్రంథములు మాత్రమే యుండతగినవి. వివిధ వస్తుప్రదర్శనశాలలు భారతీయజాతిజీవనమునకు అనుగుణ్యమైనవి కావు. అవి మనుజుని లలితకళా సౌభాగ్యమునకు శ్మశానవాటికలవంటివి. అచట భస్మము, బొమికెలు మాత్రము భద్రపర్చబడును. ఇవి యన్నియు చరిత్ర కాధారమని చెప్పెదరు. పిత్రువర్గము యొక్క సుగుణపుంజమును విశదీకరించుటకు ఈ కాలపు చరిత్రలు ఎంతవరకు ఉపకరించుచున్నవి! దేవాలయమును మసీదును జీర్ణోద్ధారణ చేసినచో పిత్రువర్గము నెడల మనకుండు భక్తిని ఎక్కువ బాగుగ తెలుపుదు చేయదా! స్వాతంత్ర్యభావమే ఇప్పుడు ప్రపంచము నంతను ఊగులాడించుచున్నది. ఈ తత్వముయొక్క సరియైన వ్యాప్తి సామాన్యజనులకు సంపూర్ణముగా వ్యక్తమగుటలేదు. ఆధునాతన మనుజునకు నమ్రతలేదు. కృతజ్ఞతలేదు. చరిత్రయన అతనికి ఎక్కువ సరదా. అదియే అతనికి తెలుసును. వైచిత్ర్యముచే మనోహరమగు జీవితతత్వము అతనికి సామాన్యముగా బోధపడదు. కాల ప్రవాహమున అతడుపడి కొట్టుకొనిపోవుచున్నాడు. ఆధునిక గ్రంథభాండాగారికుడు గ్రంథ విభజన పట్టికలను వ్రాసినట్లుగానే ఆధునిక మనుజుడు సమాధుల మీద మృతమనుజుని సంక్షిప్తచరిత్రను మాత్రము వ్రాయగలడు. నిజమైన రసస్ఫూర్తిగల ఏవ్యక్తియు వివిధ వస్తుప్రదర్శన శాలనుమాచి ఆనందము పొందనేరడు. గ్రంథాలయము వివిధవస్తుప్రదర్శనశాల కాకూడదు. కుంఠీభావమును పొందిన మనుజుని మనోవికారమునకు ఫలితమగు నుత్పన్నమగు అధమ గ్రంథములకు గ్రంథాలయమున స్థానముండరాదు. సార్థకమగు గ్రంథాలయమందలి గ్రంథములు మనుజుని మానసిక, నైతిక జీవితము నుత్తేజము చేయునవిగా నుండవలెను.

ఇక గ్రంథాలయములవలన సంఘమునకు కల్గెడి లాభములనుగూర్చి వివరించెదను. ఈ ఉద్యమ ప్రచారకులు ప్రతి గ్రామమందును ఒక గ్రంథాలయము స్థాపించవలెనని వాంఛించుచున్నారు. అట్లు చేసినచో మనుజుని జీవితమును సర్వతోముఖముగ వికసింపచేయగల్గును. మనుజుని సాంఘిక, నైతిక, మానసికతత్వముల యభివృద్ధి కొరకు దొరతనమువారి తటస్థభావకారణమున మన దేశమున తగిన సాధనములు లేకయున్నవి. ఈవిధులను పూర్వపురాజులు నిర్వర్తించుచుండిరి. ఇపుడు ఫ్రాన్సు దేశమున లలితకళల యభివృద్ధికొరకు రాజ్యాంగమున ప్రత్యేక శాఖకలదు. ఇట్లే పాశ్చాత్యదేశములం దన్నిటియందునుకూడ కలదు. సాంఘికాభివృద్ధికొరకు అచ్చటి ప్రభుత్వములు విశ్వప్రయత్నములు చేయుచున్నవి. మనదేశమున మాత్రమే ప్రభుత్వమువారు ఈయన్ని విషయములయందును మౌనభావమును పొందియున్నారు. ఆంధ్ర గ్రంథాలయ సంఘమువారు ప్రతిగ్రామమందును ఈ జవాబుదారీ వహించవలెనని నా యాశయము. రాజకీయ విషయములయందు కృషి చేయుటకు ప్రతిగ్రామమందును కాంగ్రెసు సభయుండును గాన తక్కిన అన్నివిధములగు మనుజునియభివృద్ధుల గూర్చియు పాటుపడుటకు తగినట్లు గ్రంథాలయము లుండవలెను. అట్లయినచో గ్రంథాలయములు, జీర్ణమై

పోయిన చిత్తరువులను మనకు తిరిగి సంగ్రహమగును. ప్రాచీనపండితులవైదుష్యలాభము దేశము పొందగలదు. జాతివర్ణ విచక్షణ లేకుండ "సర్వేజనాః సుఖినో భవంతు" అను న్యాయానుసారముగ బీదజనులకు అన్నదానము అస్ఖలితముగ చేయవలెను. అనాథలకు అచటశరణ్యము చేకూరవలెను. బీదలకు అన్నదానము అందరకును ఆదరణీయమే. ఈపని వెంట నేపూనుకొనవలసినదై యున్నది. అనాథలను జాడ్యగ్రస్తులను సంరక్షణచేయుట అవశ్యాచరణీయము. ఈపద్ధతినికూడ గ్రంథాలయములు నిర్వర్తింపవలసియున్నది. గ్రంథాలయనిర్వహణములో ముఖ్యముగ గమనించవలసిన విషయమొకటియున్నది. ఈ ప్రతిష్ఠాపనలు సర్వజనసమాదరణీయములుగ నుండవలెను. తగాదాలను పెంచువిషయములలో గ్రంథాలయము లెన్నడును దిగకూడదు. భారతజాతియొక్క పరమలక్ష్యమును, జీవితపరమావధియు ఈశ్వరసృష్టియందలి ఐక్యభావమును అనుభవములోనికి తెచ్చుటకు గ్రంథాలయములు నిరంతరము కృషిచేయుచుండవలెను. గ్రంథాలయభవనమందైనను అచ్చట సమావేశమగు స్వల్పకాలమువరకైనను అన్యోన్యసౌజన్యము కల్గియుండునట్లు మనము పరిస్థితుల నేర్పర్చుకొనవలెను. జగన్నాథస్వామి దేవాలయమందు జాతివిచక్షణలేక అందరకి ఎట్లు ప్రవేశమున్నదో గ్రంథాలయమందుకూడ నట్లే జాతిమతవిచక్షణలేకుండ ప్రవేశముండవలయును. స్వరాజ్యసౌధనిర్మాణమునకు ఈగ్రంథాలయములు ప్రథమపునాదులుగా నుండును.

మనము ఇక జాగుచేయకూడదు. మనభావిభాగ్యము త్రాసులో ఊగులాడుచున్నది. పాశ్చాత్యదేశమున నుద్భవించినదను కారణమున గ్రంథాలయమును గాని మరియే ఇతరప్రతిష్ఠాపనను గాని మనము త్యజించకూడదు. భ్రమరకీటన్యాయానుసారముగా ఏప్రతిష్ఠాపననైనను మన జాతీయజీవనమున కనుగుణ్యమగునట్లు మనము చేసుకొనవలసి యున్నది.

గ్రంథాలయోద్యమముయొక్క పూర్వవృత్తాంతమును గూర్చి నేను ఖండించను. నిశ్చితలక్ష్యము ననుసరించకుండ పలుత్రోవలు తొక్కుచు ఈయుద్యమము ఇదివరలో కృషిచేసియున్నది. కొన్ని సత్కార్యములు కూడ ఈయుద్యమపక్షమున జరిగినవి. గుంటూరు మండల గ్రంథాలయ సంఘమువారు ప్రచురించిన కరపత్రములు నిరర్థకములైనవి. ఈయుద్యమము నిర్ణీతప్రాప్యము కలదై దేశాభ్యుదయమునకొరకు కృషిచేయు ఇతరోద్యమములతో ఉచితమగు సంబంధములు కలదిగా నుండవలెను. విస్పష్టమగు కార్యప్రణాళికను నిర్ణయించుకొనవలసినదని మిమ్ములను కోరుచున్నాను.

# జనార్దన కుడాల్కరు

బరోడా సంస్థానాధీశుడు 1910 వ సంవత్సరమునందు ధర్మగ్రంథాలయోద్యమమును తన జనుల జ్ఞానాభివృద్ధికిగాను ప్రారంభించెను. తాను ప్రవేశపెట్టిన నిర్బంధఉచితప్రారంభవిద్యకు తోడుగా తన రాష్ట్రమందంతటను గ్రంథాలయములను స్థాపించి, ఈయుద్యమమును వ్యాపింపజేయుటకుగాను బరోడా మహారాజుగారు అమెరికాదేశమునుండి "బోర్డన్" అను నాయనను పిలిపించెను. ఆయనకు సహాయకుడుగా నియమింపబడి, ఆయన తనదేశమునకు తిరిగి పోయినపిమ్మట గ్రంథాలయపాలకుడుగా నియమింపబడి, బరోడా గ్రంథాలయోద్యమాభివృద్ధికి పట్టుకొమ్మయై విలసిల్లి మన కథానాయకుడగు శ్రీ జనార్దనకుడాల్కరుగారు 1921 సంవత్సరములో పరమపదవినొందుటవలన ఆయుద్యమమునకు తీరని నష్టము వాటిల్లినది.

ఆయన 1882 సంవత్సరములో జననమొందెను. ఆయన తండ్రి మిక్కిలి బీదవాడు. కులముచేత విశ్వబ్రాహ్మణులు. ఇతని జననమునకుపిమ్మట కొలదికాలమునకే తండ్రి చనిపోయెను. అయినను పట్టుదలతో కష్టపడి చదివి, విద్యార్థివేతనములను బొంది 1905 సంవత్సరమునందు ఎం. ఏ. పరీక్షయందు త్తీర్ణుడయ్యెను.

లాహోరు దయానంద ఆంగ్లో-వేదకళాశాలయందు 1909 సంవత్సరమువరకు ఆయన సంస్కృత ఉపాధ్యాయులుగా నుండిరి. ఆసంవత్సరమునందాయన బరోడా మహారాజాగారి రాజమందిర గ్రంథాలయమునకు గ్రంథభాండాగారికుడుగా నియమింపబడెను. పిమ్మట 1910 సంవత్సరమునందు గ్రంథాలయోద్యమవ్యాపనార్థమై అమెరికా దేశమునుండి బోర్డను దొరగారు రాగా వారికి ప్రధానసహకారిగా నియమింపబడెను.

జనులకు ముందు చదువుకొనుటకు రుచిని గలిగింపవలెను. దానిని దోహదము చేయవలెను. ఆమూలకముగ ప్రధాన నగరమందును పల్లెలయందును గ్రామగ్రంథాలయములేగాక జిల్లాలు నాలుగింటియందును జిల్లాగ్రంథాలయములను కూడ స్థాపింపవలెను. ఇట్టిమహత్తరమైన పనియందు బోర్డనుకు మన కథానాయకుడు కుడి భుజమైయుండి విశేషముగ తోడ్పడెను.

1913 సంవత్సరము నందు మహారాజాగారి ఆజ్ఞానుసారము కుడల్కారుగారు ఐరోపా, అమెరికా, జపాను దేశములను దర్శించి ఆయాదేశములందు పనిచేయుచున్న గ్రంథాలయముల పద్ధతులను విపులముగా తెలిసికొని వచ్చిరి. వారు ముఖ్యముగా తమ యాత్రయందు విశేష కాలము అమెరికా దేశమందే గడపిరి. ఇతర దేశముల కన్న ఆదేశమునందే గ్రంథాలయ వ్యాపన విషయమైన సంగతులు విశేషముగా నేర్వవలసినవి గలవని వారు కనిపెట్టిరి.

వారు 1915 సంవత్సరమున బరోడాకు తిరిగి వచ్చిన వెంటనే, బోర్డను దొరగారి స్థానమందు గ్రంథాలయ శాఖకు అధిపతిగా నియమింప బడిరి మహారాజాగారు వీరియందుంచిన గౌరవమును వీరు సార్థకపరిచిరి. వీరు ఈయుద్యమమునకై చేసిన కృషివలన బరోడా సంస్థానము యొక్కయు, మహారాజుయొక్కయు కీర్తి భారతవర్షమునందే గాక, పాశ్చాత్య దేశముల యందు గూడ వ్యాపించినది.

పాశ్చాత్యదేశములందును, అందు ముఖ్యముగా అమెరికా దేశమందును గ్రంథాలయములు జనులను ఆకర్షించుటకు జేయు ప్రకటన పద్ధతులయొక్క ఉపయోగమును గ్రహించినవారై కుడాల్కారుగారు వానిలో చాలభాగము బరోడాయందు అమలునకు దెచ్చిరి.

కుడాల్కారుగారు ఉత్సాహవంతులును, కార్యదీక్ష గలవారును నగు యువకులు. పత్రికా ప్రదర్శనములను, గ్రంథాలయ ప్రదర్శనములను, సంగీత ప్రదర్శనములను — ఎన్నింటినో సమావేశపరచి, గ్రంథాలయోద్యమమందు జనులకు ఎక్కువ ఉత్సాహము గలుగునటుల జేసిరి.

బరోడా కేంద్ర గ్రంథాలయ పక్షమున అపూర్వ సంస్కృత గ్రంథ ప్రకటనముకొరకు ఒక గ్రంథమాలను గూడ ప్రారంభింప జేసిరి. గ్రంథాలయ శాస్త్రవిషయములను ప్రకటించుటకై "లైబ్రరీ మిసలేనీ" అను పత్రికను మిక్కిలి సమర్థతతో ప్రకటించిరి. భారత వర్షమందు ఈవిషయమై ప్రకటింపబడు పత్రిక ఇదియొక్కటియే. ఈపత్రిక యొక్క ఉత్కృష్టతను గూర్చి ఐరోపా అమెరికా దేశములందలి గ్రంథాలయ పత్రికలుగూడ మెచ్చుకొనినవి. భారత వర్షమునందు గ్రంథాలయోద్యమమును వ్యాపింప జేయుటకు ఈపత్రిక మిక్కిలి సహకారి యయ్యెను.

కుడాల్కరు గారు మహారాష్ట్ర భాషయందు విద్వాంసులు. ఆభాషయందలి పత్రికలకు తరుచు వ్యాసములను వ్రాయుచుండెను. 1917 సంవత్సరమున ఇండోరు నగరమున జరిగిన తొమ్మిదవ మహారాష్ట్ర సారస్వత మహాసభయందు వీరు "చిన్నపిల్లలకు సారస్వతము" అను విషయమును గూర్చి వ్యాసము నొకదానిని జదివిరి. ఆవ్యాసము చాల మెప్పునుబడసెను.

ఆవ్యాసమును విని ఆనందించి, ఆసభకు వచ్చిన వారిలోనొకరు దానినితిరిగి అచ్చువేయించి ఉచితముగా పంచిపెట్టించిరి. 1919 సంవత్సరమున పునహా నగరమున జరిగిన "ఓరియంటల్ కాన్ఫరెన్సు"నకు వీరు బరోడా రాజ్య ప్రతినిధిగ పోయిరి. 1919 సంవత్సరమున అప్పుడు వైస్రాయిగా నుండిన లార్డు ఛెల్మ్సుఫోర్డుగారు బరోడా వచ్చునప్పటికి, "బరోడా గ్రంథాలయోద్యమము" అను చక్కని గ్రంథమును వారుతయారు జేసిరి.

కుడాల్కారుగారు గ్రంథాలయోద్యమమునకై చేసిన కృషికి ఫలితముగ, 1919 సంవత్సరమున మద్రాసునందు జరిగిన ప్రథమ అఖిలభారత గ్రంథాలయ మహాసభకు అధ్యక్షులుగ ఎన్నుకోబడిరి.

వారికిగల ఉత్సాహమునకు అంతులేదు. గ్రంథాలయ ఉద్యమమును వ్యాపింపజేయుటకు తగిన మార్గములను అన్వేషించుటకై వారు ఎల్లప్పుడును యోచించుచునేయుందురు ఇట్టి మహనీయుడు విషజ్వరముచే బాధితుడై ముప్పదితొమ్మిది సంవత్సరములు నిండక పూర్వమే, 1921 సంవత్సరమున పరమపదించి మన యుద్యమమునకు తీరని నష్టమును దెచ్చెను. వీరికి భార్య, పుత్రుడు, ఇద్దరు పుత్రికలు, గలరు.

# వివిధవిషయములు

## పబ్లిక్ లైబ్రరీలు

కొనిమెరపబ్లిక్ లైబ్రరీ ప్రేక్షకులసంఖ్య నిరుటికన్న 2968 అధికమయ్యెను. మొత్తముమీద ఈసంవత్సరము 28988 ప్రేక్షకులు లైబ్రరికి వెళ్ళియుండిరి. 39881 గ్రంథములు చదువబడెను. కడచిన సంవత్సరము 39256 గ్రంథములు చదువబడెను. ఈసంవత్సరము 309 గ్రంథములు క్రొత్తవి లైబ్రరియందు చేర్చబడెను. ఇందు 77 గ్రంథములు ఉచితముగ ఇవ్వబడెను. మిగిలిన వన్నిటిని అధికారులు కొనిరి. కార్డుఇండెక్సు విధానము ఈసంవత్సరముకూడ అమలునందుండెను. లైబ్రరికివచ్చు పత్రికలు, ప్రభుత్వప్రకటనలు, పార్లమెంటరిని వేదికములు పట్టికలు తయారుచేయబడెను.

యూనివర్సిటి లైబ్రరియందు పాఠకులసంఖ్య కడచిన సంవత్సరముకన్న అధికముగనుండెను. కడచిన సంవత్సరపు సంఖ్య 14467. ఈసంవత్సరపుసంఖ్య 15083. సంవత్సరమున 21305 గ్రంథములు చదువబడెను.

*　　*　　*

## ప్రాచ్యలిఖితభాండాగారము

ఈ సంవత్సరము 147 ప్రాచీనలిఖితగ్రంథములు ఈ భాండాగారమునందు చేర్చబడెను. ఆర్థికసౌకర్యములు లేనందున ప్రాచీనలిఖితగ్రంథములను సంపాదించుటకై ఎవ్వరును పర్యటన మొనర్పలేదు. కొందరు తమయొద్దనున్న లిఖితపుస్తకములను అమ్ముటకై అంగీకరించిరి గాని వారు అధికమగుధర చెప్పుటచే గ్రంథాలయాధికారులు ఆగ్రంథములను కొనకపోయిరి. ప్రకటనశాఖవారి పని కూడ తృప్తికరముగ నుండెను. బ్రహ్మసిద్ధియను గ్రంథమున మువ్వాతిక భాగము అచ్చయ్యెను. ఈ పుస్తకభాండాగారముయొక్క ప్రయోజకత్వము క్షీణించలేదు. ఈ సంవత్సరమున 3747 మంది పాఠకులు 6252 గ్రంథములను పరిశీలించిరి.

*　　*　　*

## మద్రాసు రికార్డు ఆఫీసు

సెక్రెటేరియటు కార్యాలయములు మరియితర కార్యాలయములనుండి ఈ ఆఫీసునకు వచ్చిన రికార్డులు కాక ఇండియా ప్రభుత్వమువారి యొద్దనుండి చెన్నపురి ప్రభుత్వమునకు సంబంధించిన రికార్డులు 1200 గ్రంథములు చేర్చబడెను. వీనిలో కొన్ని ముద్రితములు, కొన్ని వ్రాయబడినవి. ఫోర్టుసెంటు జార్జి రికార్డుల ప్రకటనము ఈ సంవత్సరముకూడ కొనసాగెను. 1702 సంవత్సరపు పబ్లిక్, డెయిలీ అండు కన్సల్టేషను, 1700-01, 1702 సంవత్సరముల ఫోర్టుసెంటుజార్జి రికార్డుల యందలి జాబులు ఈ సంవత్సరము ప్రకటింపబడెను. 1702-08 సంవత్సరములందు ఇంగ్లాండునుండి పంపబడిన ప్రభుత్వలేఖలు, 1702-30 సంవత్సరములందు ఇంగ్లాండునకు పంపబడిన ప్రభుత్వలేఖల ప్రకటనకార్యము చాల వరకు ముగిసెను. ఆనందరంగపిళ్లె గారి దినచర్య పుస్తకము 9 వ సంచిక (సెప్టెంబరు 1754 మొదలు డిశంబరు 1755 వరకు) ప్రకటన ప్రయత్నములు ప్రారంభమయ్యెను. పోలీసు వారికి సంబంధించిన బారామహాలు రికార్డులు ప్రకటింపబడెను. జనవరిలో చెన్నపురియందు భారతచరిత్ర రికార్డుల కమీషను వారి యాజమాన్యమున జరిగిన ప్రదర్శనమునకు కొన్ని లిఖితపుస్తకములను, పటములను, సీలులను రికార్డు ఆఫీసునుండి పంపబడెను.

*　　*　　*

## వార్తాపత్రికలు.

1923 సంవత్సరపు ఆఖరున రాష్ట్రమునందు 310 వార్తలనుప్రకటించుపత్రికలుండెను. 1922 సంవత్సరము ఆఖరున 277 పత్రికలు మాత్రమే యుండెను. ఈ సంవత్సరమున క్రొత్తగ 105 పత్రికలు ప్రారంభ మయ్యెను. 76 వార్తాపత్రికలు అంతరించెను. మొత్తము మీఁద సంవత్సరమున ప్రకటింపబడిన 38[illegible] పత్రికలలో 113 పత్రికలు చెన్నపురియందు ప్రకటింపబడెను. 152 పత్రికలు జిల్లాలయందును, మిగిలిన స్వదేశ సంస్థానములందును ప్రకటింపబడినవి. ఆంగ్ల దినపత్రికలలో హిందూ, మద్రాసు మెయిల్, డెయిలి ఎక్స్ప్రెస్సు, న్యూఇండియా, జస్టిసు, స్వరాజ్య పత్రికలు ముఖ్యమైనవి. డెయిలీ ఎక్స్ప్రెసు, స్వరాజ్య పత్రికల చందాదారుల సంఖ్య అధికమయ్యెను. న్యూఇండియా జస్టిసు పత్రికల చందాదారుల సంఖ్య తగ్గినది. అరవ పత్రికలలో స్వదేశమిత్రను, ఆనందబోధిని పత్రికలు ముఖ్యమైనవి. ఆనందబోధిని పత్రికకు 20 వేలమందికి చందాదారులున్నారు. తెలుగు పత్రికలలో ఆంధ్రపత్రిక చందాదారుల సంఖ్య తగ్గెను. నిమ్నజాతుల ఉద్ధరణమునకై పాటుపడు దీనబంధు, మిషన్ న్యూస్ ఫార్ విమెన్, రైతుపత్రికల చందా

దారుల సంఖ్య అధికమయ్యెను. ఇతర దేశభాషాపత్రికలలో మళయాళమనోరమ (మళయాళము) వృత్తాంత పత్రిక (కన్నడము) సహీప (ఉరుదు) పత్రికలు ముఖ్యమైనవి. పత్రికలవైఖరియందు కొంతమార్పు కలిగెను. స్వరాజ్ పత్రికవారు ప్రభుత్వమును తెరిపిలేక ఆక్షేపించుచుండుట వల్ల చందాదారుల విషయమున రాష్ట్రపు వార్తాపత్రికలలో ౪ వ స్థానము వహించెను. క్రిమినలు ప్రొసీజరుకోడు ననుసరించి 182 ప్రకటనలు ప్రభుత్వమువారిచే నిషేధింపబడెను. కడచిన సంవత్సరము ఇట్లు నిషేధింపబడిన ప్రకటనల సంఖ్య 125. ఐరోపాఖండము నుండి బోల్షివిక్కు కమ్యూనిస్టు ప్రకటనలు అధికముగ వచ్చుటచే నిషేధింపబడిన ప్రకటనల సంఖ్య అధికమయ్యెను. ఇండియనుపీనలుకోడునందలి రాజద్రోహపు సెక్షనుల ననుసరించి ఆంధ్రపత్రిక, సత్యాగ్రహి పత్రికలు ప్రాసిక్యూటు చేయబడెను. ఆంధ్రపత్రికసంపాదకుడు క్షమాపణకోరుటచే వారిపై తేబడిన కేసు ఉపసంహరించుకొనబడెను. సత్యాగ్రహిపత్రికాధిపతి, సంపాదకులు శిక్షింపబడిరి.

* * *

## పుస్తకములు.

ఈ సంవత్సరము 3587 పుస్తకములు రిజిస్టరు చేయబడెను. కడచిన సంవత్సరము 3025 పుస్తకములు రిజస్టరు అయ్యెను.

కడచిన సంవత్సరము 735 పత్రికలు పకటింపబడెను. ఈసంవత్సరము వీని సంఖ్య 817 కు హెచ్చెను. ఆంగ్ల గ్రంథముల సంఖ్య కడచిన సంవత్సరము 900. ఈ సంవత్సరము 1103. దేశభాషా గ్రంథములుకూడ అధికమయ్యెను. 2467 పుస్తకములు కడచిన సంవత్సరము ప్రకటింపబడెను. ఈసంవత్సరము ఈ గ్రంథముల సంఖ్య 2766. హిందూస్థాని, కొంకణి పుస్తకముల సంఖ్య తగ్గెను. అసామునందలి కొండజాతులవారు మాట్లాడు చిక్కా భాషా గ్రంథములు ఈ సంవత్సరమే మొదట ప్రకటింపబడెను. మొత్తముమీద 1534 మతవిషయక గ్రంథములు ప్రకటింపబడెను. చెన్నపురియందు 1916 గ్రంథములు ప్రకటింపబడెను. కృష్ణాజిల్లాలో ఇతర జిల్లాలకన్న ఎక్కువ గ్రంథములు ప్రకటింపబడెను. ప్రకటింపబడిన గ్రంథముల సంఖ్య 383. కర్నూలు కడపటి స్థానమునందున్నది. ఈజిల్లాలో మూడు పుస్తకములు మాత్రమే ప్రకటింపబడెను.

* * *

సికింద్రాబాదునందున్న శ్రీ ఆంధ్రసంవర్ధని గ్రంథాలయమునకు శ్రీ మోతే నారాయణరావు జమీందారుగారు, భవన నిర్మాణము నిమిత్తమై రు 223-4-0 లు విరాళము సంగిరి.

* * *

ఆంధ్రదేశమునకు మూలపురుషుండని చెప్పదగిన శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులుగారి వార్షికోత్సవము ఏప్రియల్ నెల 7 వ తేదీన అయియున్నది. గ్రంథాలయములన్నియు ఈ యుత్సవమును తగురీతిని సలిపెదరని కోరెదము.

* * * *

## శ్రీరామ పఠనమందిరము, కుదరవల్లి, గుడివాడ తాలూకా.

మా గ్రామములో సుమారు మూడువేల రూప్యములు వెలగల సుందరమైన భవనమును ఆ గ్రామస్థులు కట్టించి దానిలో నొక భాగము శ్రీ రామ పఠనమందిరముగను, వేరొక భాగము శ్రీరామ భజన మందిరముగను, నామకరణమొనర్చి ఉదయము 9 గంటలకు శ్రీరామ విగ్రహము ప్రతిష్ఠించి మధ్యాహ్నము 2 గంటలకు 200 గ్రంథములతోను, 3 వార్తాపత్రికలతోను, కొంతమంది చందాదారులతోను, పఠనమందిరము స్థాపించిరి. సభాకార్యక్రమము 2½ గంటలకు వేదపాఠములతోను దైవప్రార్థనలతోను ప్రారంభింపబడెను. మ. రా. శ్రీ కొల్లి సీతయ్యగారి యాజమాన్యముక్రింద సభ జరుపబడెను. మ. రా. శ్రీనూరపనేని కామశయ్య చౌదరిగారు, శ్రీ విద్వాన్ రాజుగారు (నందివాడ సంస్కృత పాఠశాలా ప్రధానోపాధ్యాయులు) మొదలగు పలువురు పెద్దలుపన్యసించిరి. అధ్యక్షుని అంత్యోపన్యాసముతోను, వందనములతోను సభముగిసెను.

—యేలెళ్ళ శ్రీరాములుచౌదరి.

# గ్రంథాలయవార్షికోత్సవము, మధిర

ఫిబ్రవరి నెల ౨౧ వ తేదీ సాయంకాలము గ్రంథాలయ వార్షికోత్సవము ప్రారంభమాయెను.

ఈ గ్రంథాలయ మతి శీఘ్రకాలములో ఆశ్చర్యకరమగు అభివృద్ధిగాంచెను. స్థాపించిన రెండు సంవత్సరములనుండి యింతవరకు గ్రంథముల సంఖ్య 1000 వరకు పెరిగెను. ఇట్టి ఔన్నత్యదశకు తీసికొనివచ్చిన గ్రంథాలయకార్యదర్శి యగు మిరియాల నారాయణ గుప్తగారెంతయు ప్రశంసార్హులు. ఈ సంవత్సరోత్సవ సభకు మాదిరాజు రామకోటీశ్వరరావుగారు అధ్యక్షత వహించిరి. వీరు హనుమకొండ కాపురస్థులు. సుప్రసిద్ధ న్యాయవాదులు. అగ్రాసనాధిపతిగారు కొంత సమయానుకూలసంభాషణ మొనర్చినతరువాత కార్యదర్శిగారు తమ నివేదికను చదివిరి. మాడపాటి వెంకటరమణాచార్యులవారి యుపన్యాసము విజ్ఞానోద్దీపితమై శ్రోతలకెంతయో యుల్లాసమును గలిగించెను. శ్రీయుతులు నయిజామురాష్ట్ర పూర్వరాజ ప్రతాపమును, పూర్వకవీశ్వర మాహాత్మ్యమును గురించియు వర్ణించునపుడు ఆవేశపూరితులై ఒడలు గగుర్పొడచ కంట తడిపెట్టని సభ్యుడుండలేడని చెప్పుట సాహసము కానేరదు. హకీమ్ రఫీయుద్దీను గారు గ్రంథాలయోపయోగములను గురించి మాట్లాడిరి. "గ్రంథము సకలసద్గుణభరితమగు స్నేహితుడు. సర్వకాల సర్వావస్థలయందును సన్నిధానవర్తియగు నెచ్చెలి. కొట్టినను తిట్టినను తన్నినను సహించగల పరమ మిత్రుడు. ప్రస్తుతము గ్రంథాలయములు ధనాభావరోగముచే బాధపడుచున్నవి. వీనికి సువర్ణఘుటికలనుమాత్రలను వాడవలయు" నను మొదలుగాగల హాస్యరసపూరితము భావగర్భితమగు వాక్యములచే సభ్యులకు ఆనందమును గలిగించిరి. తరువాత హైదరాబాదునుండి వచ్చిన అప్పన్నశాస్త్రిగారు నయిజాము గవర్నమెంటు యుద్యోగస్థులందరు మన గ్రంథాలయసభ్యులుగా జేరనగాని జనులు భయము వీడి మన సభలకు విచ్చలవిడిగా రానేరని, అధ్యక్షులగు రామకోటీశ్వరరావుగారు సర్కారు ఉద్యోగస్థులందరు ఇదివరకే తమయుద్యమమునందు సానుభూతి కలిగియున్నారనియు చాలమంది సభ్యులుగ గూడ కలరనియు తమ రాష్ట్రములో సర్కారునకును ప్రజలకును భేదభావము లేకుండ నుద్యమము సాగుచున్నదనియు తమ యంత్యోపన్యాసమున సెలవిచ్చిరి. తంజావూరు లయిబ్రరీలో 2000 అముద్రిత తెలుగు గ్రంథములుగలవు. ఇతర భాషా పుస్తకములుగూడ తెలుగు లిపియందు గలవు. అచట, ఇద్దరు వీరుల ప్రతిమలు గలవు. అందులో నొక వీరుని పేరు సుబ్బయ్య. దీనినిబట్టి పూర్వము తెలుగుభాష యిప్పుడు మన మనుకొనుచున్న త్రిలింగదేశపు సరిహద్దులను దాటిపోయి ఎక్కుడు గౌరవ ప్రఖ్యాతులను గడించినది. మనము అనమును నిజాంరాష్ట్రమందున్న పూర్వాంధ్ర చరిత్ర నయినను సేకరించవలయునని యుద్బోధ మొనర్చిరి. మామూలుగా జరుగు వందన సమర్పణము జరిగిన తరువాత, సభ ముగించబడెను.

## నిజాంరాష్ట్రాంధ్ర గ్రంథాలయసభ, మధిర

ఫిబ్రవరి ౨౨ వ తేదీ మధ్యాహ్నమున ఈసభ మధిరయందు సమావేశమయ్యెను.

సన్మానసంఘాధ్యక్షులు శ్రీయుత మాడపాటి తిరుమలరావు పంతులుగారి స్వాగతము.

దినదినాభివృద్ధి పొందుచున్న మా మధిర గ్రంథాలయాభిమానము మమ్ముల ప్రేరేపించుటంజేసి, ప్రథమయత్నమగు నిట్టి మహాజనసభ సమావేశపరుప సాహసించితిమని విన్నవించుచు, నిజాంరాష్ట్రాంధ్రగ్రంథాలయోద్యమమును గురించి సూత్రప్రాయముగ కొన్ని సంగతులను విన్నవించుచున్నాను. ఆంధ్రదేశమందలి సార్వజనిక గ్రంథాలయోద్యమము మరలటకిని పునాదియగు శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషానిలయము, ఈరాష్ట్రమునకు ప్రధాననగరమగు హైదరాబాదునందే స్థాపింపబడినదని మనమెంతయు గర్వపడదగి యున్నది.

దీనితరువాతనే, మొత్తముమీద ఆంధ్రదేశమందంతటను అనేక గ్రంథాలయములు స్థాపింపబడినవి.

13



ఆ గ్రంథాలయస్థాపకులైనవారిలో కొందఱు స్థానాంతరములం దుండుటచేతను, ఆకాలమృత్యువువాత పడుటచేతను నిజాంరాష్ట్రేతర ప్రాంతమందలి ఆంధ్ర గ్రంథాలయోద్యమముతోబాటు సాగ నవకాశము లేకపోయినదని చెప్పుటకు చింతిల్లుచున్నాను. అయినను నిజాంరాష్ట్రాంధ్రదేశమందలి ఇతర ముఖ్యపట్టణములయందు దేశభాషాభిమానులగు యువకుల యుత్సాహమువలన స్థాపింపబడిన గ్రంథాలయములు మిక్కిలి ప్రాముఖ్యమును బడయుచున్నవి.

ఇప్పటికి సుమారు నూఱు గ్రంథాలయములు మనరాష్ట్రమం దంతటను స్థాపింపబడినవని పత్రికాపాఠకుల కందఱకు తెలిసినవిషయమే. స్థాపింపబడిన ప్రతిగ్రంథాలయమును అభివృద్ధి పొందజాలకపోయినను మూడునాలుగు గ్రంథాలయములుమాత్రము స్వంతభవనమును గలిగియుండి, వివిధగ్రంథములను సంపాదింపగలిగి యున్నవి. తక్కిన గ్రంథాలయముల కూడ నట్టి స్థితికి దేవలసిన బాధ్యత మనయందున్నది.

గ్రంథాలయ మనగా పుస్తకములుగల బీరువాలున్న జీవరహితవస్తుసామగ్రి సంచయంబుగాదని మున్ను గ్రంథాలయోద్యమతత్త్వజ్ఞు లొకరు పలికినమాటలలో నెంత యర్థముగలదో పండితులగు మీకు నేను తెలుప నవసరములేదు. గ్రంథములు సేకరించుటలో ఆయా గ్రంథాలయప్రాంతములవారి స్వభావేచ్ఛల ననుసరించి పనిచేయవలసియుండును. ప్రతిగ్రంథాలయము తన ప్రత్యేకత్వము నిలుపుకొనవలెనని మన వాఙ్మయవిభాగములలో నొకదానికి మిగుల ఆదరణ చూపించవలసి యుండునుగదా! సామాన్యజనుల నాకర్షింప నాటకములు, నవలలు మున్నగు గ్రంథసంపాదన అవసరమైనను ఏచారిత్రకజ్ఞానమో, వ్యవసాయక పారిశ్రామికజ్ఞానమో, వాఙ్మయజ్ఞానమో కొంచమైన పరిశ్రమచేసి సంపాదించినగాని దేశమునకు గ్రంథాలయములవలన నిజమైన లాభము గనుపట్టక పోవచ్చునను టతిశయోక్తి గాజాలదు. గ్రంథాలయములు చేయుపను లనంతములై యున్నవి. ఏయుద్యమము బయలువెడలినను దానికి మూలకారణము యీ గ్రంథాలయోద్యమమంతే గలదను అనుభవజ్ఞుల మాట మన మెంతయు ఆదరించవలసి యుండును.

ఏతద్విషయములనే మనసునం దిడుకొని మన గ్రంథాలయములలో కొన్ని ఉపన్యాససభలు, వార్షికోత్సవ పర్వంతుల్యోత్సవములు మఱికొన్ని వక్తృత్వ పరీక్షలు మరికొన్ని యముద్రితసచిత్ర మాసపత్రికలను వెడలదీయుట మున్నగు శుభసూచకములగు వానిని జరుపుచున్నవి. అత్యంతోత్సవముతో చేయబడు నీసభయందు సమావేశమయిన ప్రతినిధిమహాశయులెల్లరు ఏకీభవించి యీ గ్రంథాలయోద్యమము సజీవమగునట్లు చేయ సహాయపడు గ్రంథాలయకేంద్ర సంఘ మొకదానిని స్థాపింప మిమ్ముల నందఱిని నేను వినయపూర్వకముగ గోరుచున్నాను.

## అధ్యక్షకోపన్యాసము

### అధ్యక్షులగు పింగళి వెంకటరామరెడ్డి దేశముఖుగారి ఉపన్యాసము.

నిజాంరాష్ట్రాంధ్ర జనకేంద్రసంఘ తృతీయ సమావేశ సందర్భమున ఆహ్వాన సంఘమువారు ఈ గ్రంథాలయ సభనేర్పరచి ప్రత్యేకముగ గ్రంథాలయోద్యమమును గురించి మాట్లాడుకొనుట కవకాశమును గల్పించినందుకు వంద్యులు. తాలూకా ప్రధాన స్థలములందిట్టి సభలను జరుప నలవాటిదివరకు లేదు. మధిర ఆంధ్రజనసంఘమువారివిషయమున మార్గదర్శకులైరి. ఆంధ్రభాషాభివృద్ధికరములగు ప్రయత్నములు మన దేశమునందు సుమారు ౨౫ సంవత్సరములనుండి జరుగుచున్నను నానా భాగములందున్న గ్రంథాలయముల ప్రతినిధులొక్కచోటజేరి ఉద్యమాభివృద్ధి కవసరమగు విషయములను గురించి సంభాషించుకొనుట కేర్పడిన మొట్టమొదటి సమావేశమిదియే.

ఆంధ్రజాతి మిక్కిలి ప్రాచీనమైనది. ఆంధ్రులకు నిజాంరాష్ట్రమే జన్మస్థానమని చరిత్రపరిశోధకులు నిశ్చయించుచున్నారు. మనరాష్ట్రములో ఆంధ్రము మాతృభాషగా గల వారిసంఖ్య ౬౮ లక్షలు. మొత్తము జనసంఖ్యలో ఆంధ్రులు సగభాగమునకంటె నెక్కువగనున్నారు. వైశాల్యమునందుగూడ తెలంగానాయని వ్యవహరింపబడు ఆంధ్రభాగము సగముకంటె నెక్కువగనున్నది. ఈ రాష్ట్రములో ముఖ్యముగ వాడబడు తెలుగు, మహారాష్ట్రము, కన్నడము యను నాలుగు

దేశభాషలలో తెలుగు భాషకే ప్రాధాన్యమివ్వవచ్చునని తేలుచున్నది. మాధుర్యమునందును, వాఙ్మయ వికాసమునందును, భాషాసౌష్ఠవమునందును, అక్షర రమ్యతయందును ఆంధ్రభాషయే ఇతర భాషలకంటె మిన్నయనిపించుకొనినది. ఇది కేవలము మన మభిమానముతో చెప్పుకొను విషయముగాదు. ఇతర దేశస్థులు సహితము దీనిని "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు" అని పొగడియున్నారు. ఇట్టి మృదుమధురమైన మన మాతృభాష మనరాష్ట్రమునందు అన్యభాషాపద సమ్మిళితమై కడు శోచనీయంబగు దుస్థితియందున్నది.

ఇప్పుడిప్పుడే జనసామాన్యమునందు మాతృభాషాభిమాన మంకురించినది. మనమందరము దాని యభివృద్ధికై నిరంతరకృషి సలుపవలసియున్నది. భాషాభివృద్ధికిని, విజ్ఞానప్రసారమునకును అనేక సాధనములు గలవు. వీనిలో గ్రంథపఠనము మిగుల శ్రేష్ఠమైనది. గ్రంథములనుగురించి ౫౦౧ సంవత్సరములకు పూర్వమున నొక పాశ్చాత్యకవి ఈ దిగువ వ్రాయబడిన ప్రకారము నుడివియున్నాడు:—

"కొట్టు తిట్టులు లేకుండ, కోపతాపములు లేకుండ, డబ్బుదస్కముగైకొనక, బోధించు నుపాధ్యాయులు పుస్తకములే. వానిసన్నిధికి బోయినచో నవి నిద్రించుచుండవు. గహనవిషయమునుగురించి ప్రశ్నించినచో నవి యేమియు దాచవు. వానిని గూర్చి దురభిప్రాయ పడినచో నవి యెన్నడును సణుగుకొనవు. అవివేకుల జూచి అవి పరిహసించవు." కావున జ్ఞానాత్మకంబగు గ్రంథసముదాయము అన్నివిధములైన భాగ్యములకంటె మిన్నయనిభావించవలెను. సత్యపథానువర్తియై, సుఖియై, వివేకియై, శాస్త్రజ్ఞుడై, భక్తిపరుడై యుండగోరెడు ప్రతిమనుజుడు తప్పక గ్రంథాభిలాషియై యుండవలెను.

పూర్వకాలమున లిపి యేర్పడుటకు మునుపు మన ఋషులు విజ్ఞానమును ఆరువేల సంవత్సరములవరకు గాపాడిరి. వేదకాలమునాటినుండి ఇప్పటివరకు వేదపన్నములసంత తండ్రి కొడుకునకు చెప్పుచున్నాడు. లిపిగేర్పడినతరువాత మనపూర్వులు తాటాకులపైనను, కొయ్యలపైనను, రాగిరేకులపైనను, శిలలపైనను వ్రాయుచుండిరి. కనుక పూర్వపు విజ్ఞానమును మనము దెలిసికొనగోరినచో నిట్టివి వీలగునంతవరకు సేకరింపబడవలయును.

వర్తమానకాలమున ముద్రణాయంత్రముల సహాయమున మనకెట్టి ఇబ్బందులులేక గ్రంథములు లభించుచున్నవి. ఇట్టియవకాశమును బోగొట్టుకొనక గ్రంథసముదాయమును ప్రతిగ్రామమునందు ప్రోగుచేయుటయు దానిద్వారా జనసామాన్యము లాభమును బొందునట్లు జేయుటయు మనవిధియైయున్నది. భాషాభివృద్ధి, విజ్ఞాన ప్రసారమునకేగాక ప్రజలలో అన్యోన్యసహకారమును, స్నేహభావమును గలిగించుటకు గ్రంథాలయములు సాధనభూతములగును.

దేవాలయములందు ధనాఢ్యులును, బీదవారును ఎట్టిభక్తి విశ్వాసములను జూపుచున్నారో, సరస్వతీ ఆలయము లనందగు నీగ్రంథాలయములయెడల సహితము ప్రజలు సమానమైన ఆదరణమును జూపవలెను. దేవాలయములేని గ్రామము నివాసయోగ్యముగాదన్నభావము మనవారియందు వ్యాపించియున్నది. ఇట్లే గ్రంథాలయముల యావశ్యకతనుగూడ గమనించి, ప్రతిగ్రామమునందు గ్రంథాలయమును స్థాపించుయత్నములు చేయబడవలెను. ఇట్టిజ్ఞానజ్యోతులు ఎన్నియున్నను చాలవు.

అమెరికా గ్రంథాలయోద్యమ నాయకుడగు డాక్టరు మెల్విల్ డేవిగారు గ్రంథాలయముల అవసరము గురించి ఇట్లు అభిప్రాయమిచ్చియున్నారు:—

"ప్రతిమనుజునికి బాల్యదశయందు పాఠశాలమూలమునను, పెద్దవాడైన పిమ్మట ధర్మగ్రంథాలయమూలమునను ప్రభుత్వమువారు విద్యగరపుట విధియైయున్నది. విధియేగాక పరిపాలనా సౌకర్యముకొరకును, రాష్ట్ర సురక్షితమునకును మిక్కిలి యవసరము."

స్వదేశ సంస్థానములలో నీవిషయమున మిక్కిలి శ్రద్ధవహించినది బరోడా రాష్ట్రాధిపతియగు శ్రీశాయాజీ గయిక్వారు మహారాజుగారే. గ్రంథాలయోద్యమ మచ్చట దినదినాభివృద్ధిగాంచి ప్రజలను విజ్ఞానవంతులనుగ నొనర్చుటకెంతయో సహకారియయినది. ఆరంభదశయందు గ్రామవాసులు గ్రంథాలయ స్థాపనోద్దేశముతో ౨౫ రూపాయిల విరాళములు ప్రోగుచేసినచో బరోడా ప్రభుత్వమువారు ౧౦౦ రూప్యముల విలువగల దేశభాషా గ్రంథముల నొసంగి ప్రోత్సహించిరి. పఠనమందిరములకు ప్రతిసంవత్సరము అర రూపాయల చొప్పున విరాళములేర్పాటు చేయబడెను. బరోడా ప్రభుత్వమువారిచే ప్రకటింపబడు గ్రంథములన్నియు నుచితముగ నారాష్ట్రములోని గ్రంథాలయములకన్నిటికి నొసగబడుచుండెను. పాఠశాలా ప్రధానోపాధ్యాయుడు గ్రంథాలయమును నడుపుభారమును వహించవలెననియు, జిల్లా తాలూకాబోర్డులు వీనిని కనిపెట్టుచుండవలె

ననియు కట్టుదిట్టము లేర్పడెను. ఇవ్విధంబున గ్రంథాలయోద్యమ నిర్మాణ కార్యక్రమమునందు బరోడా ప్రభుత్వమువారు అత్యంత శ్రద్ధవహించి తోడ్పడిరి. ప్రతిసంవత్సరము గ్రంథాలయ భవన నిర్మాణమునకును, గ్రంథదానమునకును ౨౦ వేల రూప్యములు వ్యయము చేయబడుచుండెను. ౧౯౧౯ సంవత్సరాంతమున బరోడా రాష్ట్రమంతటను ౬౮౨ గ్రంథాలయములు వెలసినవి. ఇవిగాక సంచార గ్రంథాలయములు మూలమున గ్రామముల లోని ప్రజలయందు గ్రంథపఠనాభిలాషను గలిగించి ప్రత్యేకముగ కృషిసల్పబడెను. సంచార గ్రంథాలయముల సంఖ్య ౮౫౦ వరకుండెను. ఈ విషయమున ప్రభుత్వము వారు దయచేసిన విరాళము అరువేలు.

మైసూరు ప్రభుత్వమువారుగూడ దీని నాదర్శముగ గైకొని గ్రంథాలయములను స్థాపించువిషయమున శ్రద్ధ చూపుచున్నారు. బొంబాయినగరమున సేవాసంఘము వారు ౨౦౮ సంచార గ్రంథాలయములను నెలకొల్పి సుమారు పదియేండ్లనుండి విద్యాదానమును జేయుచున్నారు. పాశ్చాత్య దేశములందీవిషయమున జూపు శ్రద్ధ అపారమైనది.

అమెరికా సంయుక్తరాష్ట్రములందు గ్రంథాలయోద్యమము ఉన్నతదశయందున్నది. అన్నివిధములైన గ్రంథముల నొకచోట ప్రోగుచేసి గాపాడుటయందలి విలువను గ్రహించియే బ్రిటిషు ప్రభుత్వమువారు తమ సామ్రాజ్యమునందు ముద్రితమైన ప్రతిగ్రంథముయొక్క ప్రతి యొకటి ఉండనులోని "బ్రిటిషు మ్యూజియం" నకు బంపవలెనని నియమ మేర్పరచిరి. ఈ మ్యూజియము లోను, పారిసు నేషనలు లైబ్రరీలోను, బర్లిను రాయలు లైబ్రరీలోను, సంస్కృత గ్రంథములు విశేషముగ నున్నవని మనము తెలిసికొనినపుడు మనకాశ్చర్యము గలుగకమానదు. ఇతరదేశములు తమకు వీలుగలిగినప్పుడెల్ల మనదేశములోని గ్రంథసముదాయమును తమ దేశములకు గొనిపోయిరి. మన మీ విషయమునందెంత ప్రమత్తులమైయుంటిమో ఇతరదేశములంత శ్రద్ధవహించియుండును. సరస్వతీదేవి స్వస్థానమును విడచి పరదేశవాసము చేయుట సంభవించినది.

నాగరికాగ్రగణ్యములగు దేశములందెల్లను గ్రంథాలయములను విరివిగ నెలకొల్పుటకు రాజులును, ప్రజలును ఉత్సాహముతో జూపుచున్నారు.

మనరాష్ట్రములో ప్రభుత్వమువారు విద్యాశాఖకై ప్రతిసంవత్సరము ౬౯ లక్షల రూప్యములవరకు వెచ్చించుచున్నారు. చదువువచ్చినవారి సంఖ్య ౧౦౦ కి ౩.౮ చొప్పునమాత్రమే యున్నదిగనుక విద్యావ్యాప్తికై పాఠశాలలను విరివిగ స్థాపించుచున్నారు. బరోడా, మైసూరు రాష్ట్రములందువలె గ్రంథాలయోద్యమమునందు కృషి సల్పుటకై స్కీము తయారుకాబడుచున్నదని కొంత కాలముక్రిందట అర్థికశాఖాసభ్యులు ఒకసభలో సెల విచ్చియుండిరని తెలియుచున్నది. ఈ ప్రయత్నములింకను ఫలసిద్ధి నొందకున్నను ప్రస్తుతము సర్కారువారిచే పోషింపబడుచున్న గ్రంథాలయములు లేకపోలేదు. హైదరాబాదులోనున్న స్టేటు (అసిఫియా) లైబ్రరీ విశాలమైన భవనముతోను, నానావిధ పత్రికలతోను, అత్యుత్తమమైన కార్యనిర్వహణపు ఏర్పాట్లతోను, విలసిల్లుచున్నది. మతము, నీతి, వేదాంతము, చరిత్ర, కళ, రాజకీయము, ప్రకృతిశాస్త్రము, సాహిత్యము, అర్థకము, పరిశోధనము మున్నగు యుద్గ్రంథములతో విరాజిల్లుచున్నది. ఆంగ్లము, ఉర్దు, అరబ్బి, పారసీభాషలకు ప్రత్యేకశాఖ లేర్పడియున్నవి. ప్రతిదినము నియమిత వేళలందు అందరు ఉచితముగ జదువుకొనవచ్చును. దీనికై ప్రభుత్వమువారెంతో ద్రవ్యమును ప్రతిసంవత్సరము వెచ్చించుచున్నారు. దేశభాషలగు తెలుగు మరాఠీ, కన్నడభాషా గ్రంథములుగూడ దీనియందుంచిన చో నిది సమగ్రమనిపించుకొనును. దీనినిబట్టి ఈ విషయమునగూడ శ్రద్ధవహించుట ప్రభుత్వమువారి యాశయమైయున్నదని మనము నమ్మవచ్చును. ఇదిగాక పురోద్యానవనమునందు (పబ్లికుగార్డెన్) గ్రంథాలయమొకటి స్థాపించు నేర్పాట్లు జరుగుచున్నవి. భవన నిర్మాణ కార్యము జరుగుచున్నది.

కళాశాలలలోను, పాఠశాలలలోను ప్రత్యేకముగ గొన్ని గ్రంథాలయములు గలవు. వీనియభివృద్ధికై ఏటేట గొంతద్రవ్యము వ్యయము చేయబడుచునే యున్నది. ఇవిగాక ప్రజలచే నడుపబడు కొన్ని గ్రంథాలయములకు ప్రభుత్వమువారు వార్షికముల నేర్పరచి తోడ్పడుచున్నారు. కేవలము విద్యాశాఖపైన నింతగొప్ప మొత్తమును దయతో వెచ్చించుచున్న ప్రభుత్వమువారిపైననే గ్రంథాలయ స్థాపన భారమునుగూడ మోపుట సమంజసముగానేరదు. ప్రజలు ప్రభుత్వమువారికి తోడ్పడినచే గాని ప్రభుత్వమువారి విద్యావ్యాపనోద్దేశ్యము కొనసాగదు. కనుక పాఠశాలలమూలమున నొకదెస విద్యావ్యాప్తికై ప్రభుత్వమువారు ప్రయత్నించుచుండ, గ్రంథాలయములను నెలకొల్పుటయందు ప్రజలు శ్రద్ధవహిం

చుట సత్వరాభివృద్ధికి శుభసూచకమగును. ఇట్టి గ్రంథాలయములకు లోకలుఫండునుండి ద్రవ్యసహాయము చేయబడునన్న నమ్మకముగలదు. ప్రభుత్వమువారి సానుభూతియు, విద్యాశాఖాధికారుల సహాయమును లభించగలదు.

నిజాంరాష్ట్రాంధ్ర దేశములో గ్రంథాలయస్థాపన విషయమున నింతవరకు కృషి సలుపబడినదో అరయుదము.

౪౫ సంవత్సరములకు పూర్వము హైదరాబాదులో స్థాపింపబడిన శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషానిలయము నిజాంరాజ్యములోనే గాక ఆంధ్రదేశమునకంతకును, సక్రమపద్ధతులపైన స్థాపించబడిన గ్రంథాలయములలో మొట్టమొదటిది. ఇయ్యది నిజాంరాష్ట్రాంధ్రుల యభివృద్ధికై పునాదిగాబనిజేసి స్వంతభవనములోను పలువిధ సౌకర్యములతోను, అధిక సంఖ్యాకములైన సంస్కృతాంధ్ర గ్రంథములతోను విరాజిల్లుచున్నది. ప్రజలచే నడుపబడు ఆంధ్రసంస్థలలోకెల్ల నీరాజ్యమునందిది అగ్రస్థానము వహించినది. దీనితరువాత పేర్కొనదగినవి సికింద్రాబాదు, హనుమకొండ, మట్టెవాడ, ఎఱ్ఱుపాలెము మున్నగు స్థలములలో నెలకొల్పబడిన గ్రంథాలయములు. దయామయులై ప్రజలయభివృద్ధికై విశ్వప్రయత్నములను జేయుచున్న మన ప్రభువుగారి పవిత్రనామముతో నిచ్చట మధిరయందు నెలకొల్పబడిన ఉస్మానియా ఆంధ్రభాషా నిలయముయొక్క వార్షికోత్సవము నిన్ననేగదా జరిగినది! మట్టెవాడ, హనుమకొండలోనున్న గ్రంథాలయములకు ప్రతిమాసము ౧౫, ౧౦ రూపాయిల చొప్పున ప్రభుత్వమువారు గ్రాంటు సయము చేయుచున్నారు.

ఆంధ్రజన సంఘోద్యమమారంభమైన గత మూడు సంవత్సరముల కాలములో గ్రంథాలయముల సంఖ్య చాలవరకు హెచ్చినది. ప్రస్తుతము వీనిసంఖ్య ౭౩ వరకు వచ్చినదని తెలియుచున్నది. నూతన గ్రంథాలయములను స్థాపించు ప్రయత్నములతోబాటు స్థాపింపబడినవన్నియు సక్రమముగ నడుపబడుచుండునది లేనిది అవలోకించుటకేర్పాట్లు చేయుట కేంద్రసంఘమువారి విధియైయున్నది. ఈకార్యము నిధిపైన నాధారపడియున్నది గనుక దేశీయులు ఉదారభావముతో ద్రవ్యసహాయము చేయవలెను.

గ్రంథాలయముల లాభములనుగూర్చిగాని వాని పాలననుగూర్చిగాని నేను ప్రత్యేకముగ చెప్పవలసినదేదియు లేదు. గ్రంథాలయోద్యమమునందు కృషిసలుపుచు తదభివృద్ధికై ప్రయత్నములు సలుపుచున్న యనుభవజ్ఞులు తమ యభిప్రాయములను దెల్పవేడుచున్నాను.

గ్రంథాలయముల కనుబంధముగ నాటకసంఘములను అన్నదానసమాజములను రాత్రిపాఠశాలలను, వినోదకరములగు ఆటపాటల క్లబ్బులను జేర్చవచ్చునని కొందరభిప్రాయపడుచున్నారు. కాని వీనివలన గ్రంథాలయములు క్షీణించుటయు, నశించుటయుగూడ సంభవింపవచ్చునని నాయభిప్రాయము. గ్రంథాలయ కార్యనిర్వాహకులు ఇతరోద్యమముల ఫలసిద్ధికై ఆశించినచో గ్రంథాలయాభివృద్ధివిషయమున సఫలీకృత మనోరథులు కాజాలరు.

పలువిధోద్యమములందు కృషిసలుపుటకు సమకట్టిన కేంద్రసంఘమునందు గ్రంథాలయశాఖ ప్రత్యేకముగ నేర్పడవలయును. ప్రతియుద్యమమునకు ప్రత్యేకశాఖల నేర్పరచవలెననెడి యుద్దేశ్యమున్నట్లు ఇదివరకేర్పడిన పరిశోధకశాఖవలన దెలియుచున్నది. గ్రంథాలయములన్నియు కేంద్రసంఘముయొక్క ప్రాపకము నంగీకరించినచో వాని స్వాతంత్ర్యమునకుగాని ప్రత్యేకకృషికిగాని భంగము వాటిల్లకుండు విధమున కేంద్రసంఘ గ్రంథాలయ శాఖవలన సహాయమును బొందవచ్చును. గ్రంథాలయోద్యమప్రయత్నములు దీనివలన కేంద్రీకరింపబడి సమత్వము అన్నిటియందేర్పడును. ఈవిషయమును గురించియు, దీనియందలి సాధకబాధకములను గురించియు ప్రతినిధులందరాలోచించెదరుగాక!

## తీర్మానములు.

౧ మహాఘనతవహించిన మన నిజాము ప్రభుత్వమువారు గ్రంథాలయోద్యమాభివృద్ధియెడ చూపుచున్న సానుభూతికిని, వారొసగుచున్న సహాయమునకును ఈసభవారు కృతజ్ఞతను ప్రకటించుచున్నారు.

౨ నిజాంరాష్ట్రాంధ్రదేశమున గ్రంథాలయోద్యమ విషయమున జేయుచున్న ప్రయత్నములకు గాను ఆంధ్రజన కేంద్ర సంఘమువారిని ప్రశంసించుచు ఉద్యమప్రచారమునకై ప్రత్యేకముగ ఏర్పాటులు చేయుటకు వారిని ఈ సభవారు కోరుచున్నారు.

౩ మహాఘనత వహించిన నిజాము ప్రభుత్వమువారు కొన్ని గ్రంథాలయములకు గ్రాంటులనొసగి చేయుచున్న సహాయమునకు ఈసభవారు కృతజ్ఞతను గనబరుచుచు తక్కినవారినిగూడ ద్రవ్యసహాయము చేయవలయునని ప్రార్థించుచున్నారు.

౪ నిజాం రాష్ట్రాంధ్ర గ్రంథాలయోద్యమ వ్యాప్తి నిమిత్తము గ్రంథాలయ సంఘ మొకటి స్థాపించుట యవసరమని యీసభవారు అభిప్రాయపడుచు దీని కార్య ప్రణాళికను తయారుచేయుటకై యీక్రింది సభ్యులుగల ఉపసంఘము నేర్పాటు చేయుచున్నారు. ఆనివేదికను త్వరలో (అనగా మూడుమాసములలో) ప్రత్యేక గ్రంథాలయ ప్రతినిధుల సభ సమావేశపరచి ప్రవేశ పెట్టవలెనని తీర్మానించుచున్నారు.

### ఉపసంఘసభ్యులు.

౧ మ.రా.రా. పింగళి వేంకట్రామా రెడ్డిగారు. (అధ్యక్షులు.)

౨ ,, వేమగంటి రామకృష్ణారావుగారు.

౩ ,, మాదిరాజు రామకోటీశ్వరరావుగారు.

౪ మౌల్వీ రఫీయుద్దీన్ సాహెబుగారు.

౫ మ.రా.రా. మల్లాది లక్ష్మీనరసింహారావుగారు. (కార్యదర్శి)

### ఒక విలేఖరిచే వ్రాయబడిన వృత్తాంతము

ఆదివారము ఉదయమంతయు సభ్యులు ఇష్టాగోష్ఠి ప్రసంగములతో కాలయాపనము గావించిరి. మధ్యాహ్నము 1½ గంటలకు వడ్డెపల్లి దేశముఖులగు శ్రీయుత పింగళి వేంకటరామారెడ్డి దొరగారు నిజాంరాష్ట్రాంధ్ర గ్రంథాలయ సభాధ్యక్షత వహింపవలెనని స్థానికులు ఆహ్వానసంఘాధ్యక్షులు నగు శ్రీమాడపాటి తిరుమల రావుగారు స్వాగతోపన్యాసము చదివిరి. అధ్యక్షులగు శ్రీయుత పింగళి వేంకటరామరెడ్డిగారు విపులమగు అధ్యక్షోపన్యాసము చదివిరి. పిదప గ్రంథాలయోద్యమమును గూర్చి బెజవాడ వాస్తవ్యులగు సూరి వేంకట నరసింహశాస్త్రిగారు భారతదేశ గ్రంథాలయములను గూర్చియు నిజామురాష్ట్ర గ్రంథాలయోద్యమమును గూర్చియు గంభీరోపన్యాస మొసంగిరి. పిమ్మట శేషాద్రిరమణ కవులలో నొకరగు వేంకటరమణాచార్యులు గారు తమ పరిశోధనానుభవమును గూర్చి విపులముగా వివరించి చెప్పిరి. అనంతరము అధ్యక్షులు వక్తల ఉపన్యాసముల ప్రశంసించిరి. తరువాత గ్రంథాలయోద్యమాభిమానులును విద్యార్థులునగు యువకులు కొందరు నిజాం రాష్ట్రప్రజన కేంద్రసంఘమునుండి గ్రంథాలయసంఘమును విడదీయవలయునను నభిప్రాయమును సూచించిరి. పిదప అధ్యక్షులు కాలహరణములతో బని లేదని తెలుపుచు ఆంధ్రకేంద్రసంఘములో గ్రంథాలయ సంఘమును కలుపవలయునా? వలదా? నియమము లేర్పాటు యను సంశయము ముందుజరుగబోవుసమావేశములో జర్చింపదగినదని అధ్యక్షులు తీర్మానించి సభ విరమించినారలు. సభ్యులలో ముఖ్యముగా నొకవిధమగు సంచలనము కలిగెను. అనంతరము వందనములతో సభ ముగింపబడెను. నాటిసభకు సుమారు 200 మంది ప్రతినిధులు లేతెంచియుండిరి. శ్రీ శేషాద్రిరమణకవులు అధ్యక్షులనుగూర్చి సభ్యులనుగూర్చి కొన్నిపద్యములు చదివి యానందపరచిరి. సభ 5 గంటలకు ముగింపబడెను.

పైన వివరించినప్రకారము సభ ముగింపుఅయిన పిమ్మట, కేంద్రగ్రంథాలయసంఘము నిర్మాణింపబడక పోవుట పరితాపకరమని ప్రత్యేకముగ ప్రతినిధులందరును సమావేశమై తీర్మానించి అధ్యక్షులకంపె నవలిక కలిగించగా భోజనానంతరము రాత్రి 10 గంటలకు మరల గ్రంథాలయ సంఘసభ జరిగినది. సభ్యులు ఉత్సాహముగా పాల్గొనిరి. ఆసభయందు గ్రంథాలయ సంఘమును స్థాపింపవలయుననియు ఆసంఘనియమములను ఉపసంఘమువారు తయారు చేయవలయునను తీర్మానము ఎంతయో ఉత్సాహమున అంగీకరింపబడెను. సభ రాత్రి 12 గంటలకు ముగింపబడెను.

# భారత వర్షమందలి ప్రాచీన సరస్వతీ భాండారములు

## మొగలాయి చక్రవర్తుల గ్రంథాగారములు.

ఆరు శతాబ్దముల కాలమును మనదేశము మొగలాయీ ప్రభువు లేలియుండిరి కదా! కావున నీప్రభువుల కాలమున మనదేశమునందు విద్యయు జ్ఞానమును యేరీతిని వ్యాప్తిజెందినదియు తెలిసికొందము. మహమ్మదీయులు దేవాలయములను, మఠముల నాశనము చేసిరని కొందరనిరి. మన విజ్ఞానైశ్వర్యము ఉత్తర హిందూదేశ పర్వత ప్రాంతముల కెట్లు పారిపోయి తలదాచుకొనినదియు ఇదివరకే వినియుంటిరి. ఆదేశీతని హిందూ

దేశ మధ్యభాగమునుండి దక్షిణరాజ్యములకును బోయి విజయనగర చక్రవర్తులవలనఁ బోషింపఁ బడెను. "ఖోటాన్" అను పట్టణమునందు డాక్టరు స్టీన్‌దొరగా రొక బౌద్ధ గ్రంథాగారమును భూమిని త్రవ్వి కనిపెట్టిరి. ఇందు యేడు భాషలయందు వ్రాయబడిన ౮,౦౦౦ వ్రాతప్రతులు గలవు. ఇందు దేవాలయమునకు సంబంధించిన సంపూర్ణమగు గ్రంథభాండాగారమంతయు గలదు. గ్రంథములన్నియు కట్టలుగఁ గట్టఁబడి మంచి స్థితియందే యున్నవి. మహమ్మదీయుల దురాగతములకు భయపడి యీ గ్రంథభాండారమును భూమియందు పాతిపెట్టి యుందురని, పైఁ జెప్పబడిన స్టీన్‌దొరగా రభిప్రాయ పడుచున్నారు.

కాని మహమ్మదీయు లెల్లరును నిట్టి దురాగతములను జేయువారు గారు. "బాగ్దాదు" వాసులగు "ఖాలిఫులు"ను, స్పెయినుదేశము నేలిన "మూరు"లును తాము పోయిన స్థలములయందెల్ల గల విజ్ఞానమును నాగరికతను ప్రోత్సాహపఱచి వృద్ధిపొందింపఁ జేసెను. దేవాలయములను నాశనము చేయుటయు, గ్రంథములను దగుల బెట్టుటయు మధ్య ఆసియా వాసులగు తురుష్కులకు నైజగుణముగ నుండెను. మహమ్మదీయులు హిందూదేశమున స్థిరనివాస మేర్పరచుకొనిన పిమ్మట క్రమముగా అయుష్మబుద్ధియు, మూర్ఖతయు తగ్గ నారంభించెను.* ఢిల్లీయం దేలిన పఠాను చక్రవర్తియగు ఫిరోజిషా తొగ్లాకునకు జ్వాలాముఖి దేవాలయమునందు ౮,౦౦౦ ల వ్రాతప్రతు లున్నవని తెలియవచ్చెను. వెంటనే వానిని "ఢిల్లీ"కిఁ దెప్పించి, ఆగ్రంథములయందుగల ముఖ్యములగు విషయముల నన్నిటిని అరబ్బీ, పారసీ భాషలలోకి భాషాంతరీకరింపజేసెను.

మొగలాయి చక్రవర్తులలోకెల్ల అక్బరు పాదుషా కాలమునందు దేశమునందుగల వివిధములగు విజ్ఞానములకెల్ల ప్రోత్సాహము కలిగెను. సుప్రసిద్ధులగు విద్వాంసులు, కవులు, చరిత్రకారులు, చిత్రకారులు, గాయకులేగాక, వివిధకళలయందును చేతిపనులయందును గూడ పారంగతులయినవా రనేకులు ఆయన సంస్థానమునందుండిరి. ఆయన గ్రంథాగారముతోడనే మనకిప్పుడు ప్రసక్తి గలదు. కావున ఆవిషయమునుగూర్చిన పంక్తులను మాత్రమే యిక్కడ వివరించెదను. "† అక్బరు యొక్క గ్రంథాలయ మనేక భాగములుగ నుండెను. కొన్ని గ్రంథము లంతఃపురమునం దుంచఁబడెను. మిగిలినవన్నియు సభాభవనమునందు బహిరంగముగ నుంచబడెను. వచనములు, పద్యకావ్యములు, హిందీయందు వ్రాయఁబడినవి, పారసీకమునందు వ్రాయఁబడినవి, గ్రీకునందు వ్రాయఁబడినవి, కాశ్మీరమునందు వ్రాయఁబడినవి, అరబ్బీయందు వ్రాయఁబడినవి అని విభాగింపబడి ప్రత్యేకముగ నుంచఁబడినవి. ఇదేవిధమున వానిని అధికారు లప్పుడప్పుడు తనిఖీ చేయుచుండిరి. అనుభవజ్ఞులగు పండితులచే ముఖ్యములగు గ్రంథములను జదివించి ప్రారంభమునుండి తుదవఱకును చక్రవర్తి వినుచుండెను. ప్రతిదినమును చదువుట ముగిసినపిమ్మట, ఆదినమున చదివిన చివరిపుటయందు చక్రవర్తి దస్కతు చేయుచుండెను. గ్రంథము ముగిసినపిమ్మట పుటల సంఖ్యనుబట్టి వెండి నాణెములను, బంగారునాణెములను చదివినవారికి బహుమాన మిచ్చుచుండెను. ముఖ్యములగు గ్రంథముల నన్నింటిని ఆయన చదివించుకొని వినియే యున్నాడు. అందుచేతనే చరిత్రాంశములు గాని, శాస్త్ర విశేషములుగాని వేదాంత విషయములుగాని ఆయనకు తెలియని వెవ్వియు లేవు. మంచిగ్రంథముల నాయన రెండుమూడు సారులు చదివించుకొని వినుచుండెను. వినుటయం దంతమాత్రము ఆయనకు విసుగులేదు. హిందీ, గ్రీకు, అరబ్బీ, పార్సీ భాషలనుండి గ్రంథముల నితర భాషలలోనికి మార్చుటకు పండితులు నియమింపబడిరి. మహాభారతమును రామాయణమును పార్సీ భాషయందు వ్రాయించెను. అధర్వవేదము, లీలావతి గణితము, తేజకము (జ్యోతిషగ్రంథము), కాశ్మీరదేశ చరిత్రము (నాలుగు వేల సంవత్సరముల చరిత్ర) హరివంశము, నలదమయంతుల చరిత్రము మున్నగు సుప్రసిద్ధ గ్రంథముల నన్నిటిని గూడ పార్సీ భాషయం దాయన వ్రాయించెను. భాషాంతరీకరణములనే గాక, స్వతంత్ర గ్రంథములను గూడ అనేకములుగ ఆయన వ్రాయించి ప్రోత్సహించెను. అక్బరునకు పిమ్మట రాజ్యమునకు వచ్చిన చక్రవర్తులుగూడ భాషాపోషణమును జేసియుండుటచే, ఢిల్లీ పట్టణమునందున్న యీగ్రంథాలయము అపూర్వ గ్రంథములకెల్ల నిలయమై విలసిల్లెను. పదునారు, పదునేడు శతాబ్దములయందున్న ముసద్దీ వ్రాతకాండ్ర వ్రాతలన్నియు నీ గ్రంథాగారమునం దుండెనని చెప్పవచ్చును. గోలకొండ హైదరాబాదులను ఔరంగజేబు నవాబుజయించి అనట

---

* Rabindra Narayan Ghosh, M. A. (Lecturer in Indian History) in "Dawn" magazine.

† Ain-in-Akbari, Blochmann's translation vol. 1; P. 103.

గల అనేక వ్రాతగ్రంథములను నీ భాండారమునకు జేర్చెను. ఈకాలమున మధ్య ఆసియా, పెరిషియా, అరేబియా దేశములు యుద్ధసంకీర్ణములై యుండ ఔరంగజేబు పరిపాలనక్రింద భారతవర్షము మాత్రము శాంతముగ నుండెను. మొగలాయీలకాలమునందు రెండు విధములగు వ్రాతలుండెను. వ్రాతప్రతులన్నిటియందును సుప్రసిద్ధ చిత్రకారులు చిత్రపటములను జేర్చి వాని యుపయోగము నెక్కువ జేసిరి. "యూసపుజూలెయికా" యను గ్రంథమును వ్రాసిన "నూర్లీ" అను మునసద్దీకి, జహంగీరు చక్రవర్తి ౧,౦౦౦ బంగారు మొహరీలను బహుమానముగ నిచ్చెను. వ్రాతగ్రంథములేగాక, బొమ్మలపుస్తకములుగూడ అనేకముగ సేకరింపబడెను. ఇట్టి మహోన్నతదశ ననుభవించిన గొప్పగ్రంథాగారముయొక్క నాశనము మిక్కిలి విషాదకరము. పదునెనిమిదవ శతాబ్దమునందు ఈగ్రంథాలయమునందలి గ్రంథములనేకములు అయోధ్యనవాబుల గ్రంథాగారమునకు గొనిపోబడెను. ౧౮౫౭ సంవత్సరమున జరిగిన సిపాయిల కలహముతోబాటు ఢిల్లీలోని పట్నములు నాశనమయ్యెను. ౧౮౫౬ సంవత్సరమున అయోధ్య అన్యాక్రాంతమైనపిమ్మట అచటి గ్రంథములనేకములు కలకత్తాకంపబడెను. మిగిలినవి లక్నోనగరమునందే యుండి నశించెను. ముట్టడిసమయమునందీగ్రంథములు కిటికీల కడ్డముగబెట్టుటకు నుపయోగించెను. ముట్టడి అయిపోయిన తరువాత విడిచిపెట్టబడిన గ్రంథములు సిపాయిల వశమయ్యెను. చాలగ్రంథములు వంటచెరుకునకుగా నుపయోగింపబడెను. కొన్నిగ్రంథములను మాత్రము వేలంపాటవేసి అమ్మగా వంగదేశమునందున్న ఏషియాటిక్ సొసైటీవారు కొనిరి. రాంపుర సంస్థానమునందును, బ్యాంకిపూరు సంస్థానమునందును పోగా మిగిలిన కొన్నిగ్రంథములు భద్రము గావింపబడియున్నవి. అయోధ్యనవాబుగ్రంథాలయమునందలి కొన్ని వ్రాతప్రతులు లక్నోనగరమునందున్న మ్యూజియమునకు జేర్చబడినవి. ఆగ్రంథము లన్నిటిమీదను అయోధ్యనవాబుయొక్క సీలు ముద్రింపబడియున్నది.

## రాజమందిరములు–పారసీ, అరబ్బీ గ్రంథములు

మైసూరునందు టిప్పుసుల్తాను ౨,౦౦౦లు గ్రంథములను జేర్చెను. అరబ్బీ, పార్సీ భాషలయందు వ్రాయబడిన ఆగ్రంథములలో చాలభాగము ఇంగ్లాండునకు గొనిపోబడెను. అట్లు కొనిపోబడిన గ్రంథములపట్టిక కేంబ్రిడ్జి పట్టణమున ౧౮౦౯ సంవత్సరమునందు ప్రకటింపబడెను. ఆగ్రంథములలో కొన్నిటిని ఇంగ్లాండు దేశమందున్న గ్రంథాలయములకిచ్చిరి. మరికొన్నిటిని "ఫోర్టు విలియం కాలేజీ"కిచ్చిరి. అక్బరుచే పార్సీ భాషయందు వ్రాయింపబడిన మహాభారతముయొక్క నాలుగు సంపుటములు లిప్పటికిని జయపుర గ్రంథాగారమునందున్నవి. దానియందు సుందరములగు చిత్రపటము లనేకములున్నవి. ప్రతి చిత్రపటమునకును పైన ఉల్లిపొరవంటి లేడిచర్మము ఆచ్ఛాదనముగ వేయబడియున్నది. జయపుర గ్రంథాగారమున మొగలాయి చక్రవర్తులయొక్కయు, ఇతరులయొక్కయు, చిత్రపటము లనేకములు గలవు. ఆల్వారునందున్న గ్రంథాగారమునందుగూడ అనేక అపూర్వగ్రంథములును పటములును గలవు. ఇందున్న గ్రంథములలో చాల భాగము భానిసింగు మహారాజువలన సంపాదింపబడినవి. పదునైదు దినముల కొకపుటవంతున పన్నెండు సంవత్సరములయందు అఘామీర్జా అనుమసద్దీచే వ్రాయబడిన "గులిస్థాను" అను కావ్యముగూడ ఈగ్రంథాగారమునందున్నది. ఈ గ్రంథమునందు గొప్ప చిత్రకారులనేకులు వ్రాసినపటములు గలవు. ఈ గ్రంథమునందలి పుటలయొక్క అంచులయందు చిత్రంపు బనులను గులాం ఆలీఖాను, బలదేవు అను వారలిద్దరు చేసిరి. ఈ గ్రంథముతయారగుటకు ఒక లక్షరూప్యములైన వ్యయమైయుండును. మూడువేల రూపాయలను ఖరీదుగను, మంచి దుస్తులను బహుమతిగను నిచ్చి ఆల్వారురాజు, కోరానుయొక్క చక్కని ప్రతినొకదానిని ఒక ప్రయాణికుని యొద్ద కొనెను. ఈగ్రంథము తయారుచేయుటకు పడిన శ్రమనుగూర్చి యోచించిన, ఈక్రయధనము కారుచౌకగనున్నదని "హెండ్లీ" అను దొర వక్కాణించియున్నాడు. ఈ గ్రంథమున అరబ్బీభాషయందు మూలము ఊదాసిరాతో వ్రాయబడి దానిక్రిందటీక పారసీకభాషయందు ఎఱ్ఱసిరాతో వ్రాయబడియున్నది. మూలమునందున్న ప్రతియక్షరమునకు చుట్టును తెల్లనియంచు కట్టబడియున్నది. జయపురమునందు జరిగిన ప్రదర్శనమునందు దీనిని ప్రదర్శించెదరని విని దూరదేశముల నుండికూడ జనులనేకులు చూచుటకై విచ్చేసిరి.


## పారసీ, అరబ్బీ, భాషలయందలి నవీన వ్రాత గ్రంథములు.

రాంపూరునవాబు సిపాయీల తిరుగుబాటు కాలమున సాయ్యమిచ్చికొని అనేక పారసీ, అరబ్బీ గ్రంథములను సేకరించియున్నాడు. అతని భాండారమున ౮౮౬౪ అరబ్బీ గ్రంథములును ౮౫౪౩ పార్సీ గ్రంథములు ఉన్నటుల దెలియవచ్చెను.

# శ్రీ రామనామ స్మరణ

ఉత్సాహమువలన మొదట తాత్కాలికముగ ప్రమాణము చేసెదరుగాని పిమ్మట వ్యామోహము కలిగినపుడు లొంగిపోయెదరు. అట్టిస్థితిలో భగవంతుడే ఆధారము. అందువలన రామనామస్మరణ చేయవలెనని నేను వారికి బోధించితిని. సర్వాంతర్యామి, సర్వేశ్వరుడు, ఏకోనారాయణుడు, అల్లా, దేవుడు, మున్నగు నామములన్నియు ఏపరమేశ్వరునకు వర్తించునో ఆపరమేశ్వరుండే రాముడని నా అభిప్రాయము గాన నేను వారికి రామమంత్రము నుపదేశించితిని. వారు మూఢవిశ్వాసమువలన నేనే తమపాలిటి దైవమని తలచుచున్నారు. ఆ అజ్ఞానమును పోగొట్టవలెను. నాబోటిఅశక్తుండగు నొకమానవుడే దైవమనుదుర్భ్రమను తొలగించవలెను. కోట్లకొలదిభక్తుల నాపదలనుండి యుద్ధరించిన రామనామమహిమ జగద్విదితము గాన నా మహామంత్రమును వారి కుపదేశించితిని. ప్రతిదినమున నుదయమున సూర్యోదయాత్పూర్వమునను రాత్రి పరుండబోవుటకు ముందును రామనామమును స్మరింపవలెనని నేను వారిని కోరితిని. సర్వేశ్వరుని రాముడను పేరుతో పెక్కుకోట్లనుండి హిందువులు ధ్యానించి తరించుచున్నారు. నీకు భయము వేసినపుడు రామనామమును స్మరింపుమని పసితనమున నా పెద్దలు నాకు బోధించిరి. ఆపత్కాలమున రామనామమును స్మరించి నామిత్రులెందరో చిత్తశాంతినిబడసియుండు నేనెరుగుదును. కావుననే బాలురకును నిమ్నజాతులకును ఆపన్నివారికముగు రామమంత్రమును నే నుపదేశించితిని. పాండిత్యవిశేషమున గర్వము కనులగ్రమ్మినవారును, అహంభావము నుదురనివారును, భక్తినశించినవారునగు దేశీయులు హిందువులందరును రామనామస్మరణ చేయవలెననియే నేను కోరెదను. పాండిత్యము మనజీవితములో చాల సోపానముల నెక్కించునుగాని ఆపద, వ్యామోహము మున్నగునవి కలిగినపుడుమాత్రము నిరుపయోగమేయగును. అపుడు భగవద్భక్తియే మనకుశరణ్యము. దైవభీతి కలవారికిని పాపకార్యములను చేయగూడదని కోరుచుండినను వ్యామోహమును గెలువజాలని వారికినిమాత్రమె రామనామము రక్షకమగును.

— మో. క. గాంధి



# గ్రంథాలయోద్యమము

గ్రంథకర్త: యాతగిరి లక్ష్మీ వేంకటరమణ

వెల రు **0—8—0**

ఇందు 1. ధర్మ గ్రంథాలయ స్థాపన. 2. ధర్మ గ్రంథాలయ పాలనము. 3. ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము. 4. ప్రాచీన గ్రంథాలయములు — హిందూదేశము. 5. బరోడా గ్రంథాలయోద్యమము—ఉద్యమ ప్రారంభము. 6. బరోడా గ్రంథాలయోద్యమము — కేంద్ర గ్రంథాలయము. 7. బరోడా గ్రంథాలయోద్యమము — ఉద్యమ నిర్మాణము. 8. గ్రంథాలయోద్యమము — విదేశ గ్రంథాలయములు. 9. గ్రంథాలయోద్యమము — ఇంగ్లాండుదేశము. 10. గ్రంథాలయోద్యమము — అమెరికా సంయుక్తరాష్ట్రములు— అను పది అధ్యాయము లున్నవి.

గ్రంథాలయోద్యమమునుగూర్చి విపులముగా దెలుపునట్టి గ్రంథము. బరోడా గాయక్వారుగారి పటము ఇందుగలదు. ప్రతిగ్రంథాలయమును, గ్రంథాలయోద్యమాభిలాషియు తప్పక చదువవలసినది.

వలయువా రిట్లు వ్రాయవలెను:—

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము,

బెజవాడ.

RSVM01 A 128

22

## మీకేపుస్తకము కావలసినను

# వేంకటరామ్ కంపెనీ.

## పుస్తకముల షాపు

# బెజవాడ

## అనివ్రాయవలెను

---

# ఫ్రెండ్సు కంపెనీ, బెజవాడ.

### మా కంపెనీ క్రొత్తడాబాలోనికి మార్చబడినది

అన్నివస్తువులు వరసమైన ధరలకు కావలయుననిన ఫ్రెండ్సు కంపెనీ కొకసారి దయచేయుడు. ఫౌంటెన్ పేనాలకు, తలనూనెలకు, సెంటులకు, తెలుగు పుస్తకములకు, సిగారులైటులకు, యెలెక్ట్రికు దీపములకు, లేసులకు, పన్నీరుబుడ్లకు, గ్లాసుసామానులకు ఫ్రెండ్సు కంపెనీకే వెళ్ళుడు.

---

# తొట్టివైద్యము.

కూనెగారి "అభినవవైద్యశాస్త్రము, ముఖవైఖరీవిద్య, రోగారోగ్యవివేకము, శిశుపోషణ" అను 4 గ్రంథములలోని సంగతులన్ని సులభశైలిని వ్రాయబడినది. తొట్టిస్నానములను గురించి వేఱొకగ్రంథము చదువనక్కరలేదు. 7 సంపుటములు. 36 అధ్యాయములు. 400 పుటలు. చక్కనిబైండు. వెల ౩-0-0. (ప్రకృతి చందాదారులకు 2-8-0)

అడ్రెసు:—

మేనేజరు,

ప్రకృతి ఆఫీసు, బెజవాడ.

---

ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్ (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యగారిచే ముద్రించి ప్రకటింపబడినది.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 128 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/2 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 25 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | 2 |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhy |
| స్కాన్ చేసినది | sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |